Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Vcrdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్కూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 347 | హైదరాబాద్ | మంగళవారం 03 నవంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR

కూకటివేళ్లతో పెకిలిస్తాం



కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఫైర్

- రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం
- వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్‌ను సాగనంపుతాం
- రేవంత్‌రెడ్డి సీఎం ఎలా అయ్యారు?
- బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో కేంద్ర హోంమంత్రి
- బషీర్‌బాగ్ నుంచి ఎంజే మార్కెట్ వరకు పాదయాత్ర

హైదరాబాద్, నవంబరు 02 (ప్రజాతీర్పు)

తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్‌ను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో మూడింట రెండు వంతుల మెజారిటీతో తప్పకుండా అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను ఏటీఎంగా మార్చి 'ఆర్‌ఆర్ (రాహుల్--రేవంత్) ట్యాక్స్' వసూలు చేస్తున్నారని, ఢిల్లీకి ముడుపులు చేరుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని అమ్మేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని బీఆర్ఎస్, ఎంఐఎం అడ్డుకోలేవని, కేవలం ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ మాత్రమే అడ్డుకోగలదని పేర్కొన్నారు. సర్ ప్రక్రియతో

-2వ పేజీలో



బియ్యం అక్రమార్కులపై కొరడా

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 18 వ్యాపార సంస్థలపై దాడులు.. 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు
- రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, దారి మళ్లింపుపైనా కేసులు
- 25 కిలోల బస్తాపై 26 కిలోల లేబుల్.. ఎంఆర్‌పీపై అధిక ధరల స్టిక్కర్లు
- దుకాణాలు మూసి, అక్రమాలను సరిచేసుకునే పనిలో వ్యాపారులు

హైదరాబాద్, నవంబరు 02 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టిస్తూ వినియోగదారులను దోపిడీ

-2వ పేజీలో

జనంలోకి కేటీఆర్
11 నుంచి బస్సు యాత్ర



- పాదయాత్రకు ట్రయల్ రన్?
- ప్రభుత్వ వైఫల్యాల పై ప్రచారం
- నాలుగు రోజులు సాగనున్న యాత్రదూకుడు పెంచిన యువనేత



చుట్టారు. నవంబర్ 11 నుంచి 14 మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర ఉంటుందని ఆ పార్టీ నేత గంగుల కమలాకర్ వెల్లడించారు. మేడిగడ్డ నుంచి ఈ యాత్ర ప్రారంభమై, గోదావరి పరీవాహక ప్రాంతంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగనుంది. దెబ్బతిన్న ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని స్వయంగా పరిశీలించడంతో పాటు, రైతులు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకుని ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. తెలంగాణలో బీజేపీ 'మహా పాదయాత్ర' పేరిట తన రాజకీయ వేడిని పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ఎత్తిచూపుతూ, ప్రజలను మళ్లీ తమ వైపు తిప్పుకోవడానికి బీఆర్ఎస్ ఈ బస్సు యాత్రను ఒక బలమైన అస్త్రంగా మలచుకుంటోంది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే ఆరు నెలల్లో తెలంగాణ వ్యాప్తంగా కేటీఆర్ పాదయాత్రకు కూడా ఆ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. దీనికి ముందుగా ఈ బస్సు యాత్రను ఒక ట్రయల్ రన్‌గా, ప్రజల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వేదికగా ఉపయోగిస్తున్నారు. ఇదే జోరులో తెలంగాణ ఉద్యమ చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్ (నవంబర్ 29) సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009లో కేసీఆర్ దీక్ష సమయంలో అరెస్టుకు గురైన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను నిర్వహించనున్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ప్రజా పాలనపై దృష్టిపెడుతుంటే, మరోవైపు బీజేపీ జాతీయ అంశాలతో పాటు స్థానిక సమస్యలపై దూకుడు పెంచింది. ఇప్పుడు బీఆర్ఎస్ కూడా కేటీఆర్ బస్సు యాత్రతో ప్రజల్లోకి వస్తుండటంతో తెలంగాణ రాజకీయం రంజుగా మారుతోంది.



విదేశీ సాయంపై నాతో బహిరంగ చర్చకు రండి

ప్రధాని మోదీకి రాహుల్ సవాల్

దిల్లీ: దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయంటూ ప్రధాని మోదీ ఇటీవల చేసిన ఆరోపణలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ తిప్పికొట్టారు. ఈ అంశంపై తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సవాలు విసిరారు. మోదీయే విదేశీ శక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారని ప్రత్యారోపణ చేశారు. "మోదీజీ.. ఈ దేశానికి అబద్ధాలు చెప్పడం ఆపండి. విదేశీ శక్తుల సాయంతోనే మీరు ప్రధాని అయ్యారు. వాటి అండతోనే ఆ పీఠంపై కొనసాగుతున్నారు. మీ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నియంత్రిస్తున్నది విదేశీయులే. విదేశీ సోషల్ మీడియా మీకు సంపూర్ణ మద్దతిస్తోంది. ఈ అంశంపై ఏ వేదికపైనైనా, ఎప్పుడైనా మీతో బహిరంగ చర్చకు నేను సిద్ధం. మీకు ధైర్యముంటే రండి. మీరు

-2వ పేజీలో

ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో లక్ష మందికి ఉచిత శిక్షణ

- అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహణ
- నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, నవంబరు 02 (ప్రజాతీర్పు)

రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీ,

-2వ పేజీలో



తమిళనాడు విద్యావ్యవస్థలో బిగ్ చేంజ్..

సీఎంగా విజయ్ 'మూన్ మ్యాన్' మార్క్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్!

తమిళనాడు రాజకీయాల్లోనే కాదు... ఇప్పుడు ఆ రాష్ట్ర విద్యావ్యవస్థలోనూ సంచలన మార్పులకు సీఎం విజయ్ శ్రీకారం చుట్టారు. పాఠశాల విద్యను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఒక ప్రతిష్ఠాత్మక అడుగు వేశారు. ఈ భారీ ప్రయోగానికి నేతృత్వం వహించే బాధ్యతను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ లో 'మూన్ మ్యాన్'గా పేరుగాంచిన ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ మయిల్ స్వామి అన్నాదురై చేతికి అందించారు.

కమిటీ ప్రధాన లక్ష్యం ఏమిటి?

డాక్టర్ అన్నాదురై ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎడ్యుకేషన్ కరికులం డిజైన్ కమిటీ ప్రధానంగా తమిళనాడు స్టేట్ సిలబస్‌ను పూర్తిగా రీ-డిజైన్ చేసే పనిలో నిమగ్నమైంది. వాస్తవిక బోధన: తరగతి గదిలో పిల్లలు అసలు ఏం నేర్చుకోవాలి? నేర్చుకునే చదువు వారి భవిష్యత్తుకు ఏ విధంగా ఉపయోగపడాలి? అనే అంశాలపై ఈ కమిటీ లోతైన కసరత్తు చేస్తోంది. ఇది మొత్తం విద్యావ్యవస్థలోనే

-2వ పేజీలో



కుప్పంకు కృష్ణాజలాలు రేవంత్ గురుదక్షినే..

- అల్వాలలో ఓ రైతు ఎండిపోయిన తన పంట గురించి మాజీ మంత్రి హరీశ్‌రావుకు వివరిస్తున్న దృశ్యం
- సకాలంలో మోటార్లు ప్రారంభించకపోవడంతోనే.. వరద దిగువకు వెళ్లింది
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

వనపర్తి, నవంబరు 02 (ప్రజాతీర్పు)

ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ ఇచ్చేందుకు 700 కి.మీ. దూరంలోని కుప్పంకు కృష్ణాజలాలను తరలించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు ధ్వజుమెత్తారు. పాలమూరును ఎండబెట్టి దిగువకు వరుదను వదిలి పెట్టిన ఘనత అసమర్థ పాలకుడు రేవంత్‌కే చెల్లుతుం దన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మం డలం అల్వాల గ్రామంలో ఎండిన పంటలను ఆయన మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,

-2వ పేజీలో

క్లీన్.. ట్రాఫిక్ ఫ్రీ

హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి సమగ్ర కార్యాచరణ

- మున్సిపల్ అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఇంటింటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ.. నిరంతర పర్యవేక్షణ
- చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- సింగిల్ ఫ్రీ వ్యవస్థకు అండర్ పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు

హైదరాబాద్, నవంబరు 02 (ప్రజాతీర్పు)



గ్రేటర్ హైదరాబాద్ మహా నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ అధికారులతో నగర అభివృద్ధి, పారిశుధ్యం, చెత్త నిర్వహణ, గ్రీన్ వాటర్ వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నగరంలో

-2వ పేజీలో

కూకటివేళ్లతో పెకిలిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పాటు ఈవీఎంలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఎస్ఐఆర్ వల్లే బీజేపీ గెలుస్తోందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నట్టు ఈవీఎంల ద్వారానే బీజేపీ గెలుస్తూ ఉంటే... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచింది? రేవంత్‌రెడ్డి సీఎం ఎలా అయ్యారని నిలదీశారు. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, కేరళం, తమిళనాడులో బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్‌ను శాశ్వతంగా సాగనంపడంతో పాటు, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ కార్యకర్తలు సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు.

సోమవారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజాంజాహి మార్కెట్ వరకు, 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం...అరాచకత్వాన్ని అంతం చేద్దాం' నినాదంతో బీజేపీ నిర్వహించిన మహా పాదయాత్రలో పాల్గొన్న అమిత్ షా.. దాదాపు ఒకటిన్నర కి.మీ మేర నడిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పార్టీ కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భాగ్యలక్ష్మీ అమ్మవారికి, హైదరాబాద్‌ను భారత్‌లో అంతర్భాగం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు, విప్లవ వీరులు కొమురం భీమ్, రాంజీ గోండ్‌లకు శిరస్సు వంచి ప్రణామం చేశారు.

అరాచకత్వాన్ని అంతం చేయాలి

'ప్రజాస్వామ్యాన్ని కాపాడి అరాచకత్వాన్ని అంతం చేసేందుకు తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్?ను గద్దెదించాల్సి ఉంది. ఇందుకు కార్యకర్తలు పిడికిలి బిగించి సంకల్పం తీసుకోవాలి. రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తే కటాకట్‌గా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న రాహుల్‌గాంధీ మాటలు 'సఫా కట్' అయ్యాయి. సుపరిపాలన ఎలా ఉంటుందో మమ్మల్ని చూసి నేర్చుకోవాలి. ప్రధాని మోదీ హామీ ఇచ్చిన మేరకు రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు జరిగాయి.అవినీతి, నక్సలిజం అంతం అయ్యాయి. 2029 డిసెంబర్ చివర్లోగా దేశాన్ని డ్రగ్స్ సమస్య నుంచి విముక్తి కలిగించేలా చర్యలుంటాయి. ఇందుకోసం బీజేపీ కార్యకర్తలు పిడికిలి బిగించి ముందుకు సాగాలి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఇచ్చిన గ్యారంటీలు అమలుకాక కుప్పకూలిపోయాయి. పదేళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌ది. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో ఆయనపై కనీసం పావలా (చార్ అణా) అవినీతి ఆరోపణ కూడా చేయలేకపోయారు. కాంగ్రెస్ అవినీతిపై పోరాడి ప్రజలకు న్యాయం చేసే ఏకైక శక్తి బీజేపీ మాత్రమే..' అని అమిత్ షా చెప్పారు.

పార్లమెంటులో చర్చకు ఎందుకు రారు?

'సర్, ఈవీఎంలపై పార్లమెంటులో చర్చకు కాంగ్రెస్ ఎందుకు ముందుకు రావడం లేదు? 2014, 2019లలో ఎస్ఐఆర్ లేకుండానే దేశ ప్రజలు నరేంద్ర మోదీని సంపూర్ణ మెజారిటీ గెలిపించారు. 2024 తర్వాత హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ విజయం సాధిస్తే ప్రజలు గెలిపించినట్టు చెబుతూ, ఓడిపోతే ఈవీఎంలను నిందించడం చూస్తుంటే 'ఆడలేక మద్దెల ఓడు' అన్న సామెత అక్షరాలా సరిపోతుంది. మాక్ పార్లమెంట్‌లో తప్ప రాహుల్ గాంధీ ఎప్పటికీ దేశానికి ప్రధాని కాలేరు.కానీ సోనియాగాంధీ హృదయానికి శాంతి కలిగి ఉంటుంది. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్, మిత్రపక్షాలు నిర్వహించింది 'ఓట్ బచావో' కాదు...'ఘుస్‌బైటియా (చొరబాటుదారుల) బచావో' ర్యాలీ. రాహుల్ బాబా, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత గింజుకున్నా ఒక్క అక్రమ చొరబాటుదారుడిని కూడా ఓటర్ల జాబితాలో, అసలు దేశంలోనే ఉండబోనివ్వబోం. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియతో పాటు..గతంలో కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్న ఎన్ఆర్‌సీని కూడా కచ్చితంగా చేపట్టి తీరుతాం.

రాహుల్‌కు కడుపు మంట ఎందుకు ?

సర్ ప్రక్రియతో బోగస్ ఓట్లు తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి కడుపుమంట ఎందుకు? దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ రాహుల్ గాంధీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఈ మొత్తం 13 కోట్ల ఓట్లలో దాదాపు 6.5 కోట్ల ఓట్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారివి. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు వేసే హక్కు ఉంటుందా? దాదాపు 3 కోట్లు చనిపోయిన వారివి. చనిపోయిన వారి పేరిట కాంగ్రెస్ బోగస్ ఓటింగ్ చేయాలని చూస్తోంది.మరో కోటి ఓట్లు డూప్లికేట్ ఎంట్రీలు. మిగిలిన 3 కోట్ల ఓట్లు దేశంలో ఉనికిలోనే లేని బంగ్లాదేశ్ చొరబాటుదారులవి. ఈ రకమైన ఓట్లను జాబితాలో నుంచి తొలగించాలా వద్దా? (సభికులు తొలగించాలంటూ అరిచారు). ఈ నకిలీ, చొరబాటుదారుల ఓట్లను కాపాడేందుకే రాహుత్‌గాంధీ గగ్గోలు పెడుతున్నారు. సర్‌కు సంబంధించిన వాస్తవాలతో తెలుగులో ముద్రించిన బుక్‌లెట్లను బీజేపీ కార్యకర్తలు తెలంగాణలోని ఇంటింటికీ తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ఎండగట్టాలి..' అని అమిత్ షా పిలుపునిచ్చారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, ఎం.రఘునందన్‌రావు, అర్వింద్ ధర్మపురి, గోడెం నగేష్, బీజేఎల్?పనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, ఇతర నేతలు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మీ ఆలయంలో హారతి ఇచ్చిన అమిత్‌షా

చారి?మనార్: అమిత్ షా సోమవారం చారి?మనార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని సందర్శించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి స్వీకరించిన తర్వాత ఆయన స్వయంగా హారతి పళ్లెం పట్టుకుని భక్తులకు చూపిస్తూ హారతి ఇచ్చారు. అంతకుముందు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి.ఉమామహేందర్‌లతో కలిసి ఆలయానికి చేరుకున్న అమిత్ షాకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం లభించింది. అఫ్జల్‌గంజ్ నుంచి నయాపూల్, మదీనా సర్కిల్, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్ మీదుగా ఆలయానికి చేరుకున్న ఆయనకు, ట్రస్టీ శశికళ బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించింది. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసింది.

అరాచకత్వాన్ని అంతం చేయాలి..

పదేళ్ల యూపీఏ పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్‌ది. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో ఆయనపై కనీసం పావలా (చార్ అణా) అవినీతి ఆరోపణ కూడా చేయలేకపోయారు. కాంగ్రెస్ అవినీతిపై పోరాడి ప్రజలకు న్యాయం చేసే ఏకైక శక్తి బీజేపీ మాత్రమే.

పార్లమెంటులో చర్చకు ఎందుకు రారు?

రాహుల్ బాబా, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత గింజుకున్నా ఒక్క అక్రమ చొరబాటుదారుడిని కూడా ఓటర్ల జాబితాలో, అసలు దేశంలోనే ఉండబోనివ్వం. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియతో పాటు..గతంలో కాంగ్రెస్ పార్టీ అడ్డుకున్న ఎన్ఆర్‌సీని కూడా కచ్చితంగా చేపట్టి తీరుతాం.

రాహుల్‌కు కడుపుమంట ఎందుకు?

సర్‌కు సంబంధించిన వాస్తవాలతో తెలుగులో ముద్రించిన బుక్‌లెట్లను బీజేపీ కార్యకర్తలు తెలంగాణలోని ఇంటింటికీ తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ఎండగట్టాలి

బియ్యం అక్రమార్కులపై కొరడా

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న వ్యాపారులపై పౌరసరఫరాల శాఖ దాడుల్లో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మూడు రోజులపాటు అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 18 వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోగా, 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్), తూనికలు, కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు సంయుక్తంగా గత నెల 29 నుంచి 31 వరకు రిటైల్, హోల్‌సేల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. బియ్యం విక్రయాల్లో వ్యాపారులు అనుసరిస్తున్న అక్రమ పద్ధతులు తనిఖీల్లో బయటపడ్డాయి.ముఖ్యంగా 25 కిలోల బియ్యం బస్తాలపై 26 కిలోలుగా పేర్కొంటూ లేబుళ్లు అతికించి వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. బస్తాపై ముద్రించిన అసలు ధరను తొలగించకుండా, దానిపై ఎక్కువ ధరలతో కొత్త స్టిక్కర్లు అతికించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కంపెనీలు నిర్ణయించిన ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించేందుకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు కొన్ని వ్యాపార సంస్థలు అవసరమైన అనుమతులు, లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, కార్మిక శాఖ అనుమతులు, ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన ఎఫ్ఎస్–ఎస్ఏఐ లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, దారి మళ్లింపు వ్యవహారాలపైనా అధికారులు దృష్టి సారించారు.ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, వాటిని రీసైక్లింగ్ చేసి 26 కిలోల బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి విక్రయించినట్లు తేలింది. బియ్యం సరఫరా, నిల్వలు, విక్రయాల తీరును పరిశీలిస్తూ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్న సంస్థలపై ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా, సరూర్‌నగర్, జీడిమెట్ల, అల్వాల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి చట్టప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొంది.పౌరసరఫరాల శాఖ దాడుల నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని రైస్ మిల్లర్లు, ట్రేడర్స్, హోల్‌సేల్ డిపోలు, రిటైలర్లు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజులుగా షాపుల షట్టర్స్ మూసివేసి 26 కిలోల బ్యాగుల్లో తక్కువగా ఉన్న బియ్యాన్ని సరిచేయడం, లేదంటే వేరే గోడౌన్‌లకు తరలించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. చౌకధరల దుకాణాల ద్వారా సేకరించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ లేబుళ్లు ఉన్న బస్తాల్లో నింపి విక్రయిస్తున్న మిల్లర్లు, రైస్ డిపోల హోల్‌సేల్ వ్యాపారులు కూడా అప్రమత్తమయ్యారు.

క్లీన్.. ట్రాఫిక్ ఫ్రీ

ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసు కోవాలన్నారు.ఇంటింటి నుంచి ప్రతిరోజూ చెత్త సేక రణ జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయా లని, ఈ ప్రక్రియపై నిరంతరం పర్య వేక్షణ ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్ల క్ష్యం వహించే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకో వాలని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వాటిని తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ పారి శ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణకు 'ఐలా' అధికారులతో సమన్వయం చేసుకోవా లని సూచించారు. అలాగే, నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్‌స్కేపింగ్, గార్డెనింగ్, ఇతర అవసరా లకు తాగునీటిని వినియోగిస్తున్న పరిస్థితిని మార్చాలని సీఎం సూచించారు.మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని ఈ అవసరాలకు వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చ న్నారు. ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే 'గ్రీన్ వాటర్ ట్యాంకర్ల'ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలు, సంబంధిత సంస్థలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారు లను ఆదేశించారు. జలమండలి తొలివిడతగా 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోనూ గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ నిర్వహణ, పార్కుల అభివృద్ధి తదితర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సిగ్నల్ ఫ్రీ రాకపోకలకు ప్రణాళికలు

హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోకుండా రాకపోకలు నిరంతరాయంగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.నగరంలోని ప్రధాన రహదారులు, కీలక కూడళ్లలో ట్రాఫిక్ రద్దీకి కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో
లక్ష మందికి ఉచిత శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై గానీ, కళాశాలలు లేదా విద్యార్థులపై గానీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తెలంగాణ 'ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇందుకు సంబంధించిన సోమవారం సచివాలయంలో టాస్క్, ఏడబ్ల్యూఎస్ మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లోని విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ తదితర ఇండస్ట్రీ ఓరియెంటెడ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ప్రత్యక్షంగా ప్రాక్టికల్స్ చేసేందుకు ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ తదితర నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకు కూడా ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి 'ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్' ద్వారా 900 కంటే ఎక్కువ డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షల కోసం డిస్కౌంట్ వోచర్లను కూడా అందిస్తామన్నారు. విద్యార్థులకు సాంకేతిక నిపుణులతో ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్లను నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.ఆయా కళాశాల్లోని అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ సాంకేతికతలో ప్రపంచస్థాయి శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ.బాలకిష్టా రెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి , ఏడబ్ల్యూఎస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ హెడ్ అభినవ్, కంట్రీ మేనేజర్(స్కిల్లింగ్ సోషల్ ఇంపాక్ట్) ప్రతిభా, ఏడబ్ల్యూఎస్ అకాడమీ టీపీఎం ఆకాంక్ష రాయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ సుంకరి యాదయ్య
స్టూడెంట్ కు గోల్డ్ మెడల్

ఖమ్మం నవంబర్ 02 ప్రజాతీర్పు ప్రతినిధి



గత నాలుగు దశాబ్దాలుగ మార్షల్ ఆర్ట్స్ రంగంలో రాణిస్తున్న ప్రముఖ అంతర్జాతీయ కరాటే మాస్టర్ డాక్టర్ సుంకరి యాదయ్య విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించింది ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఖమ్మంలో నిర్వహించిన కరాటే పోటీలలో కరీంనగర్ కు చెందిన సుంకరి యాదయ్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు,బ్లాక్ బెల్ట్ పోటీలో ఓ విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించింది ఈ విజయం తన గురువు సుంకరి యాదయ్య కు అంకితమిస్తున్న పేర్కొంది, వేలాది విద్యార్థిని విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ విద్యను నేర్పించిన సుంకరి యాదయ్య అంతర్జాతీయ కరాటే పోటీలలో తన విద్యార్థులు పాల్గొని విజయం సాధించే విదంగా శిక్షనిస్తున్నట్లు తెలిసింది, ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని నిర్వహకులు తెలిపారు.

విదేశీ సాయంపై
నాతో బహిరంగ చర్చకు రండి

(మొదటి పేజీ తరువాయి)

రారు. ఎందుకంటే.. మీ గురించి నా వద్ద ఉన్న సమాచారం చూసి భయపడుతున్నారు" అని రాహుల్ 'ఎక్స్'లో సోమవారం పేర్కొన్నారు.

విదేశీ శక్తుల టూల్ కిట్ రాహుల్: నబీన్

కోల్‌కతా: దేశాన్ని అస్థిరపరిచేందుకు యత్నిస్తోన్న విదేశీ శక్తుల టూల్‌కిట్‌గా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యవహరిస్తున్నారంటూ భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇండియా కూటమి 'ఓట్ చోరీ' ప్రచారాన్ని తిప్పికొడుతూ కోల్‌కతాలో సోమవారం భాజపా నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం..అరాచకాన్ని అంతం చేద్దాం' ర్యాలీలో ప్రసంగిస్తూ ఈ ఆరోపణ సంధించారు. 'రాహుల్ గాంధీ నుంచి దిల్లీకి విముక్తి కల్పించాల'ని పిలుపునిచ్చారు. నేపాల్‌తో పాటు మన పొరుగు దేశాల్లో అశాంతికి కుట్రపన్నిన విదేశీశక్తులతో విపక్షనేత కలిసి పనిచేస్తున్నారని నబీన్ పేర్కొన్నారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్‌ను ఓడించామని, 2029లోనూ రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఆ పార్టీ అపజయంపాలవుతుందని తెలిపారు.

ఈసీ తరఫున భాజపా నేతలే ఎందుకు మాట్లాడుతున్నారు?

వారణాసి: 'సర్' కసరత్తులో 13 కోట్ల ఓట్లు తొలగించారన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలను భాజపా జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర తోసిపుచ్చారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళనకే సర్ కసరత్తు చేపట్టారంటూ సోమవారం వారణాసిలో జరిగిన విలేకరుల సమావేశంలో గట్టిగా సమర్థించారు. దీనిపై తాము సంధించిన ప్రశ్నలకు భాజపా నేత నుంచి నేరుగా సమాధానాలు రాకపోవడంతో పాత్రికేయులు నిరసన తెలిపారు. ఈ క్రమంలో సంబిత్ పాత్ర అర్ధంతరంగా అక్కడి నుంచి నిష్క్రమించారు. ఓటర్ల జాబితాల వివాదంపై విలేకరుల సమావేశాన్ని ఎన్నికల సంఘం (ఈసీ) ఎందుకు నిర్వహించడంలేదని విలేకరులు ప్రశ్నించారు. ఈసీ తరఫున భాజపా అధికార ప్రతినిధులు ఎందుకు మాట్లాడుతున్నారని నిలదీశారు.

తమిళనాడు విద్యావ్యవస్థలో
బిగ్ చేంజ్..

(మొదటి పేజీ తరువాయి)

కీలక పరిణామంగా చెప్పవచ్చు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా: కేవలం ర్యాంకులు, మార్కుల వేట కాకుండా... సైన్స్, టెక్నాలజీ, క్రిటికల్ థింకింగ్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా సిలబస్‌ను రూపకల్పన చేయనున్నారు. దీని ద్వారా పిల్లల్లో చిన్న వయసు నుంచే నేర్చుకోవాలనే ఆసక్తి, తపన, పట్టుదల పెరుగుతాయి.

'మూన్ మ్యాన్' ఎందుకు?

చంద్రయాన్-1, మంగళయాన్ వంటి చారిత్రాత్మక ప్రాజెక్టుల్లో డాక్టర్ మయిల్ స్వామి కీలక పాత్ర పోషించారు. ఈయన ఆలోచనా విధానం ఎప్పుడూ నూతన ఆవిష్కరణల వైపే ఉంటుంది. ఒక రోదసీ శాస్త్రవేత్త పాఠశాల విద్యను రీ-డిజైన్ చేసినట్లయితే పిల్లల్లో చిన్నతనం నుంచే పరిశోధనాత్మక దృష్టిని పెంపొందిస్తుంది. అందుకే సీఎం విజయ్ సర్కార్ ఇలాంటి వినూత్నమైన నిర్ణయం తీసుకున్నారు. తద్వారా ప్రయోగాల ద్వారా నేర్చుకునే వినూత్న పద్ధతులు అందుబాటులోకి వస్తాయి. దీంతో విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలవైపు మొగ్గు చూపుతారు.

విద్యార్థులకు మేలు

'మూన్ మ్యాన్' రీడిజైన్ విధానం ద్వారా పాతకాలపు బట్టీ చదువుల నుంచి విద్యార్థులకు విముక్తి లభించనుంది. కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్‌తో పాటు నిత్య జీవితంలో ఉపయోగపడే ప్రాక్టికల్ నైపుణ్యాలు సిలబస్‌లో విద్యార్థులు భాగం కావచ్చు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా రాష్ట్ర సిలబస్ ప్రమాణాలు పెరిగి.. విద్యావ్యవస్థ మరింత ప్రతిష్ఠాత్మకం కానుంది.

ముఖ్యమంత్రి విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం తమిళనాడు విద్యా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతుందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. విద్యావ్యవస్థను అంతరిక్ష విజ్ఞాన స్థాయికి తీసుకెళ్లాలనే ఈ 'మూన్ మ్యాన్' ప్రయోగం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి.!

కుప్పంకు కృష్ణాజలాలు రేవంత్ గురుదక్షిణే..

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో హరీశ్ మాట్లాడారు. నీళ్లకు, కరెంటుకు, పంటలకు సెలవు ఇవ్వాలంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన బాధ్యతల నుంచి సెలవు ఇచ్చే రోజులు దగ్గర పడ్డాయన్నారు. శ్రీశైలానికి 221 టీఎంసీలు, జూరాలకు 252 టీఎంసీల నీళ్లు వచ్చినా.. సకాలంలో వరద జలాలను సద్వినియోగం చేసుకుని చెరువులు, రిజర్వాయర్లను నింపుకునే ప్రయత్నం చేయకపోవడంతో పాలమూరు జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, వచ్చేది కేసీఆర్ సర్కారేనని, మళ్లీ పాలమూరులో పసిడి పంటలు పండేలా సాగునీటి వనరులను సమకూరుస్తామని చెప్పారు. కేఎల్ఐ లిఫ్ట్‌లోని మోటార్లు పూర్తిస్థాయిలో నడిస్తే.. నెలకు పది టీఎంసీల చొప్పున ఇప్పటి వరకు 50 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉన్నా.. ఇప్పటి వరకు లిఫ్ట్ చేసింది కేవలం 18 టీఎంసీలేనని, మిగతా నీటిని గురువు చంద్రబాబుకు వదిలిపెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డిలో వారం రోజుల్లో తీసే మట్టి తవ్వకం కూడా చేపట్టలేని చేతగాని ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఒక్క అల్వాల గ్రామంలోనే 250 ఎకరాలు, రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా.. రైతులు, రైతుకూలీలకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, సాయం ఏమి చేస్తారో చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఆంధ్రాకు వరదలొస్తే పరిగెత్తుకొచ్చిన కేంద్ర బృందాలు తెలంగాణలో కరువు వస్తే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాలనే ధ్యాస రాష్ట్రాన్ని పాలిస్తున్న రేవంత్‌రెడ్డికి, కేంద్ర మంత్రులకు, బీజేపీకి లేకపోవడం బాధాకరమన్నారు. రైతులకు పరిహారం ఇచ్చే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.



పాఠశాలలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) నవంబర్ 02

సోమవారం మండలంలోని బోడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ పోదేం స్వరూప -సుధీర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులతో ముచటించటం జరిగింది.విద్యార్థులను పలు ప్రశ్నలు అడగడం జరిగింది.పరీక్షలకు,పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలో ఉపాధ్యాయులతో కలిసి వివరించడం జరిగింది. అనంతరం మధ్యాహ్నం భోజనం గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది.పక్కనే వున్నా ప్రాథమిక పాఠశాలను సందర్శించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో బోడు గ్రామస్తులు కుంజా సాంబయ్య, పోతుగంటి వీరభద్రం, క్యాగర్ల శ్రీనివాస్,బస్వాలింగం,మీనుగు సురేష్,చిలువేరు చంద్రశేఖర్ పాల్గొని పలు సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మేడి లక్ష్మణ్ పాల్గొన్నారు.



పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

సిద్దిపేట జిల్లా, నవంబర్ 02 ప్రజా తీర్పు

సిద్దిపేట జిల్లా నంగునూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ళీ) ద్వారా మంజూరైన చెక్కును నంగునూరు మండలానికి చెందిన లబ్ధిదారుకు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ పంపిణీ చేశారు. నంగునూరు గ్రామానికి చెందిన కొండిల స్రవంతి భర్త వెంకటేష్‌కు మంజూరైన ఏఎంసీ చెక్కును ఆయన అందజేశారు. మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ సహకారంతో ఈ సాయం మంజూరైనట్లు సాదుల పవన్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్స్ ఎండీ ఇమ్రాన్,జీవన్ నాయక్, పిడిచెట్టు ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, లింగంపల్లి అజయ్, చిర్రం భాను, ప్రశాంత్, శంకరయ్యతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హాస్పటల్లో పనిచేసిన మహిళ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనం ఇప్పించిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

జగద్గిరిగుట్ట, నవంబర్ 2, (ప్రజా తీర్పు)

నియోజకవర్గం లోని హౌసింగ్ బోర్డ్ లో విశిష్ట హాస్పిటల్ లో గత ఏడు నెలలుగా పని చేసిన వేతనం కోసం మహిళా కార్మికులు ఎంతో ఇబ్బందులు పడ్డారు విశిష్ట హాస్పటల్ యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ మహిళా కార్మికులకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న వేతనం నాలుగు 4,లక్షల 19000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో ఎవరైతే మనకు కార్మికుల పట్ల న్యాయం జరుగుతుందని తెలుసుకొని తోటి కార్మిక మిత్రుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని, అతని కార్యాలయం వద్దకు వెళ్లి ఆ మహిళ కార్మికులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన రవి విశిష్ట హాస్పటల్ యజమాన్యం తో మాట్లాడి మహిళా కార్మికులు మొత్తం ఒక్కొక్కరికి రావాల్సిన వేతనం, జితేంద్ర ప్రసాద్ 60,000, వీరస్వామి 90,000, సాకేత్ 13000, శ్రావ్య 17000, సమత 15000, మనుష 8000, సుకన్య 40,000, నాగరాణి 55000, రేవతి 16000, జ్యోతి 18000, భాగ్యలక్ష్మి 17000, ఝాన్సీ 70,000, వేల రూపాయలు మొత్తం 4 లక్షల19000/- వేల రూపాయలు మొత్తం 12 మంది మహిళ కార్మికులకు చెక్కు రూపంలో అందజేయడం జరిగింది... మహిళా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల కష్టజీతం ఇప్పించడంతో సహాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు అంగీకారం

దీపావళి పండుగ వేళ ఢిల్లీ ప్రజలకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. బాణాసంచాపై పూర్తిస్థాయి నిషేధం విధించేందుకు నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో గ్రీన్ క్రాకర్స్ కాల్చుకునేందుకు అనుమతించింది. అయితే నవంబర్ 7,8 తేదీల్లో నిర్దిష్ట సమయాల్లో మాత్రమే వీటిని కాల్చాలని స్పష్టం చేసింది. జస్టిస్ ఎం సుందరేష్, జస్టిస్ ప్రసన్న బీ. వరాలేతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 7, 8 తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే గ్రీన్ క్రాకర్స్ కాల్చుకోవచ్చని తెలిపింది.

బోడుప్పల్‌లో అక్రమ షెడ్ల రాజ్యం.. అధికారుల అండదండలేనా?

- రోజు రోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ షెడ్ల నిర్మాణం.
- ఎన్నిసార్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు.
- మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం!.



మేడిపల్లి, నవంబర్ 2 ప్రజాతీర్పు:

మేడ్చల్--మల్కాజిగిరి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు రోజురోజుకూ పెరుగుతోంది. నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ అనుమతులు ఉన్నాయా? లేవా? అన్నది పట్టించుకోకుండా భారీ షెడ్లు నిర్మిస్తున్నా సంబంధిత మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే మౌనం వహిస్తుండటంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోడుప్పల్‌లోని బొల్లిగూడెం అయోధ్య నగర్‌లో భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతుండగా, కట్ట మైసమ్మ వైన్స్‌ను ఆనుకొని మరో భారీ షెడ్ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఆరోపణలు వస్తున్నా, మరోవైపు కొత్త కొత్త షెడ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ముడుపులిస్తే అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నలా? 'ముడుపులు ఇచ్చుకో. దర్జాగా నిర్మించుకో.'

అన్న చందంగా బోడుప్పల్‌లో పరిస్థితి తయారైందని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అధికారుల అండదండలు లేకుండానే ఇంత బహిరంగంగా భారీ నిర్మాణాలు ఎలా కొనసాగుతాయని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఎందుకు మౌనం వహిస్తోంది? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు, నిబంధనలు సైతం లెక్కచేయకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అయోధ్య నగర్, కట్ట మైసమ్మ వైన్స్ సమీపంలోని నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అనుమతులు ఉన్నాయో లేదో స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే తక్షణమే పనులు నిలిపివేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ప్రేక్షకపాత్ర వహిస్తే ప్రజలకు న్యాయం ఎక్కడ? బోడుప్పల్‌లో వెలుస్తున్న అక్రమ షెడ్లకు అడ్డుకట్ట ఎప్పుడు? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



కరీంనగర్--వరంగల్ మధ్య నాన్‌స్టాప్ ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సుల ప్రారంభం

- ఎన్‌హెచ్--563 విస్తరణ పనులు పూర్తి.. నాలుగు ఈవీ బస్సులతో ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సౌకర్యం

(ఇమ్రాన్ జోహ్రి, ప్రజాతీర్పు, కరీంనగర్) నవంబర్ 02

కరీంనగర్--వరంగల్ మధ్య జాతీయ రహదారి 563 (ఎన్‌హెచ్--563) విస్తరణ పనులు పూర్తవడంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల సౌకర్యార్థం నాన్‌స్టాప్ ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. సోమవారం నుంచి ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చినట్లు కరీంనగర్--2 డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్, వరంగల్ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించి, ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించడమే ఈ సర్వీసుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఉదయం నాలుగు సమయాల్లో బస్సులు

కరీంనగర్ నుంచి ఉదయం 7.15, 8.00, 8.30, 9.00 గంటలకు నాలుగు ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సులు బయలుదేరనున్నాయి. ఒక్కో బస్సు రోజుకు మూడు ట్రిప్పులు నిర్వహించనుంది. మొదటి ట్రిప్పు నేరుగా వరంగల్ వరకు నాన్‌స్టాప్‌గా నడుస్తుండగా, తదుపరి ట్రిప్పులు హనుమకొండ వరకు కొనసాగనున్నాయి. ఈ సర్వీసులకు శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి ప్రాంతాల్లో నిలుపుదల ఉండదు. టికెట్ ధరలో ఎలాంటి మార్పు లేదని, ప్రయాణికుడికి రూ.150గా కొనసాగుతుందని డిపో మేనేజర్ వెల్లడించారు.

హుజూరాబాద్‌లో స్టాప్ కల్పించాలని విజ్ఞప్తి

కొత్త సర్వీసులను ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ రవీంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు, హుజూరాబాద్ ప్రజలు, నిత్యం ప్రయాణించే ప్రయాణికులు తమ ప్రాంతంలోనూ బస్సులకు నిలుపుదల కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. హుజూరాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్ మధ్య విద్య, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం ప్రయాణించే వారికి స్టాప్ ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం: నల్లాల వినయ్ కుమార్

పిట్లం / నవంబర్ 2 (ప్రజా తీర్పు):



జర్నలిస్టులు సమాజంలో జరిగే సంఘటనలు, వాస్తవాలు, ప్రజా సమస్యలను సేకరించి, ధ్రువీకరించి ప్రజలకు అందించే బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నల్లాల వినయ్ కుమార్ పేర్కొన్నారు. కత్తి కన్నా కలం గొప్పది" అనే మాటకు పాత్రికేయులే నిదర్శనమని అన్నారు. రోజువారీ వార్తల ద్వారా ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచుతూ, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ రాత్రింబవళ్లు శ్రమించే పాత్రికేయులు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో కీలకమని తెలిపారు. జర్నలిస్టులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, అలాంటి ఘటనలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నల్లాల వినయ్ కుమార్ కోరారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే ...

సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

(బుగ్గ కృష్ణమూర్తి ప్రజాతీర్పు సిరిసిల్ల) నవంబర్ 2



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్య క్రమం నిర్వ హించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్లజిల్లా ఎస్పీ మహేష్ బిగితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బిగితే మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

నిఘా నీడలో హరిదాస్ నగర్ గ్రామం.

- కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా 08 సీసీ కెమెరాల ఏర్పాటు.
- సీసీ కెమెరాలను ప్రారంభించిన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి.

(బుగ్గ కృష్ణమూర్తి ప్రజాతీర్పు)

ఎల్లారెడ్డిపేట నవంబర్ 2



ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా గ్రామ పంచాయతీ సహకారంతో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ... కమ్యూనిటి మరియు నేను సైతం పోసిలింగ్ లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో నిరంతరంగా కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామాలు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.నేరాల నియంత్రణ, నేరాలకు పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాలను అరికట్టడంతో పాటు నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామాల భద్రత ప్రజలందరి బాధ్యత అని, పోలీసులకు ప్రజలు సహకరిస్తూ నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డీఎస్పీ కోరారు. ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ సిఐ వెంకటేష్, ఎస్.ఐ రమేష్ , సర్పంచ్ చిర్రంనాగరాజు, మార్కెట్ కమిటీ వైర్మన్ మేడిపల్లి దేవానందం, వైస్ వైర్మన్ నంది కిషన్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటినరసయ్య, ఏఎంసి డైరెక్టర్ రాజు, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, గ్రామపంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి...

యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డిఎస్పి నాగేంద్ర చారి అన్నారు. హరిదాసు నగర్ గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీలో పాల్గొనగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత యోగులు చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణించి గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

యువత గంజాయి, డ్రగ్స్ ఇలాంటి వాటిని నిరోధించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. వాలీబాల్ జట్టుకు సర్పంచ్ నాగరాజు టీ షర్ట్స్ ఇప్పించగా డిఎస్పీ చేతుల మీదుగా వాలీబాల్ ఆడే యువకులకు పంపిణీ చేశారు.

ప్రభుత్వ విద్యాలయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

(పాష సయ్యద్ వేములవాడ, ప్రజాతీర్పు) నవంబర్ 02




ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల నిర్వహణ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కేజీబీవీ డీసీఓలు, ఈఎంఆర్ఎస్ బాధ్యులు, ఈఈ పీఆర్, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం భోజనం, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, తరగతి, వసతి గదుల నిర్మాణం, టాస్క్ ఫోర్స్ టీంల తనిఖీ నివేదికపై చర్చించి.. తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీసి దిశా నిర్దేశం చేశారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో మొత్తం 19 అదనపు తరగతి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈఈ పీఆర్, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన అదనపు తరగతి గదుల పనులు, టాయిలెట్స్, ప్రహరీ ఇతర మౌలిక వసతుల నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని స్పష్టం చేశారు. అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో ఫ్యాన్లు లైట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా విద్యాధికారి విజయ సాగర్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూ ఐ డీ సీ ఈఈ రామకృష్ణ అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కేజీబీవీ డీసీఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖలో అక్రమ వసూళ్ల ఆరోపణలు

- జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు
- డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలి
- భారతీయ నవజీవన్ పార్టీ యువ మోర్చా అధ్యక్షులు నూనె శ్రీనివాస్

కరీంనగర్ నవంబర్ 02 ప్రజాతీర్పు ప్రతినిధి



కరీంనగర్ కార్మిక శాఖ పరిధిలో సిరిసిల్ల డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొంటున్న మహేష్ బాబు వ్యవహారంపై పలు అనుమానాలు, ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని భారతీయ నవజీవన్ యువమోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి కార్యక్రమంలో అధికారికంగా ఫిర్యాదు సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తికి సిరిసిల్లలోని ఒక మీ సేవా కేంద్రంతో సంబంధాలు ఉన్నాయనే సమాచారం, కార్మికులకు వివిధ సేవలు, ప్రభుత్వ పథకాల దరఖాస్తులు, క్లెయిమ్‌ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా మహేష్ బాబు ఉద్యోగంలో చేరిన తేదీ నుంచి నేటి వరకు ఆయన నియామకం, విధులు, వేతనాలు, మీ సేవా కేంద్రంతో సంబంధాలు, భాగస్వామ్యాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులపై చట్టబద్ధమైన పద్ధతుల్లో సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి (దీూజబి) పరిధిలో కార్మికుల క్లెయిమ్‌లు, పథకాల దరఖాస్తులు, ప్రయోజనాల మంజూరు విషయంలో ఏవైనా అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయా అనే అంశాన్ని కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే సంబంధిత కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ రోజులు గడుస్తున్నా స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన శాఖలోనే కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నూనె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని ,కార్మికుల సంక్షేమ నిధులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దుర్వినియోగం కాకుండా పారదర్శకమైన వ్యవస్థ ఉండాలని నూనె శ్రీనివాస్ అన్నారు.



సాతవాహన యూనివర్సిటీలో డిసెంబర్ 5న మెగా జాబ్ మేళా

- 50కి పైగా ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) నవంబర్ 02

కరీంనగర్‌లోని సాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 5, 2026 (శనివారం)న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ సంయుక్తంగా ప్రకటించారు. నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో ఈ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఐటీ, ఐటీఈఎస్, ఇంజినీరింగ్, తయారీ రంగం, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆరోగ్యం, నర్సింగ్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, బీపీఓ, రిటైల్, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, సేల్స్ అండ్ మార్కెటింగ్, విద్య, టెలికాం, డిజిటల్ మీడియా తదితర రంగాల్లో నియామకాలు చేపట్టనున్నాయి. డిగ్రీ, పీజీ, బీ.ఫార్మసీ, డీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. 2018 నుంచి 2026 మధ్య చదువు పూర్తి చేసిన ఫ్రెషర్లు, అలాగే పని అనుభవం ఉన్న అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించనున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు మాట్లాడుతూ, విద్యార్థులు, నిరుద్యోగ యువత నేరుగా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులను కలుసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు, ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఈ మేళా మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ తాజా రెజ్యూమ్, బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు.

జాబ్ మేళా వివరాలు:

- తేదీ: డిసెంబర్ 5, 2026 (శనివారం)
- వేదిక: సాతవాహన యూనివర్సిటీ ప్రాంగణం, కరీంనగర్
- పాల్గొనే కంపెనీలు: 50కి పైగా
- అర్హత: డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు
- అనుభవం: 2018--2026 మధ్య చదువు పూర్తి చేసిన ఫ్రెషర్లు, అనుభవజ్ఞులు

నటుడు ఇమ్రాన్ ఖాన్ బేషరతు క్షమాపణ

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు నటుడు ఇమ్రాన్ ఖాన్ బాంబే హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. అమెరికా పౌరుడైన ఆయన భారతదేశంలో నిరసనల్లో పాల్గొనడంపై న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత పౌరుడు అమెరికాలో ఇలాంటి నిరసనల్లో పాల్గొంటే అక్కడి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో ఆలోచించాలని కోరింది. ఇమ్రాన్ ఖాన్ అమెరికా పౌరుడు కావడంతో అతనికి 'సర్' అంశంతో ఎలాంటి సంబంధం లేదని ధర్మాసనం పేర్కొంది.

ఆపదమిత్ర శిక్షణ ఫేజ్--2 విజయవంతంగా ముగింపు

(జక్కుల శ్రీకాంత్ ప్రజా తీర్పు ప్రతినిధి) నవంబర్ 2



కరీంనగర్ :విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు యువతలో సేవాభావం, ధైర్యసాహసాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఆపదమిత్ర శిక్షణ ఫేజ్--2 విజయవంతంగా ముగిసింది. మంచిర్యాల జిల్లా గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (ూ), కరీంనగర్, శాతవాహన విశ్వవిద్యాలయానికి చెందిన మొత్తం 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ముగింపు కార్యక్రమానికి 13వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వర్లు, సీఐ అశోక్ కుమార్, జ్ఞానేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు శిక్షణ పొందిన యువత కూడా బాధితులకు తక్షణ సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. శిక్షణ పొందిన ఆపదమిత్రులు తమ పరిసర ప్రాంతాల్లో విపత్తులపై అవగాహన కల్పిస్తూ, ఆపద సమయాల్లో బాధ్యతాయుతంగా సేవలందించాలని తెలిపారు.

విపత్తులపై సమగ్ర శిక్షణ

ఏడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు, తుఫానుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రథమ చికిత్స, జూ=, అత్యవసర తరలింపు పద్ధతులు, నీటిలో మునిగిన వారిని రక్షించడం, శోధన, సహాయక చర్యలపై విద్యార్థులకు సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందించారు.అలాగే విపత్తు నిర్వహణలో సమన్వయం, బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, స్వీయ రక్షణ, బాధితులకు మానసిక ధైర్యం కల్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్స్, ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రాక్టికల్ వ్యాయామాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా స్పందించేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులను అభినందించిన కళాశాల యాజమాన్యం

ఆపదమిత్ర శిక్షణ ఫేజ్--2లో ఎస్.ఆర్.ఆర్. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేయడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్, టి. రాజయ్య, ు+జ+ూా రాష్ట్ర అధ్యక్షులు, చీూా అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా. కె. సురేందర్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయ చీూా కోఆర్డినేటర్ డా. ఈ. మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా చీూా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. విజయ్ కుమార్, డా. కె. తిరుపతి, బి. ఎలిజబెత్ రాణి, డా. కె. అర్జున్, డా. పి. తిరుపతి, ఎం. వెంకటేశ్వర్లు, జి. రాజేందర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థులు కేవలం విద్యా విషయాలకే పరిమితం కాకుండా, సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తూ, సమాజ సేవలో ఆపదమిత్రులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.



ఉపాధి హామీ పనిదినాలను 225 రోజులకు పెంచాలి

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్

కరీంనగర్ నవంబర్ 02)

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోపించి వ్యవసాయ రంగం సంక్షోభంలో పడటంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోతున్నారని, వారి జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పథకం పనిదినాలను ప్రస్తుతమున్న 125 రోజుల నుంచి 225 రోజులకు పెంచాలని కోరుతూ సోమవారం కోహెడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ కోహెడ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ కార్యకలాపాలు తగ్గిపోవడంతో రైతులతో పాటు వ్యవసాయంపై ఆధారపడి జీవించే కూలీలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరి నాట్లు, కలుపు తీయడం, పంట కోతలు వంటి వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే వర్షాకాలం వరకు దాదాపు 110 రోజుల పాటు వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న 125 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కూలీల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. కూలీల కుటుంబాల ఆకలి బాధలను, ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఉపాధి హామీ పనిదినాలను 225 రోజులకు పెంచడంతో పాటు వ్యవసాయ పనులు లేని కాలంలో గ్రామాల్లో నిరంతరాయంగా ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో కూలీలకు అవసరమైన పనులను గుర్తించి ప్రారంభించాలని, చేసిన పనికి నిర్ణీత సమయంలో కూలీ డబ్బులు చెల్లించాలని కోరారు. కోహెడ మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీల పరిస్థితిని పరిశీలించి, వారికి తగిన ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి రాసూరి యుగేందర్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మహేష్, రాజు పాల్గొన్నారు.




ఘనంగా సమాధుల పండుగ

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) నవంబర్ 02

సోమవారం సులానగర్, కోయగూడెం, మాలపల్లి, ముత్యాలంపాడు ఎక్స్ రోడ్, గ్రామాలలో సమాధులు పండుగ జరుపుకున్నారు చనిపోయిన వారి శాంతి చేకూరాలని సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఆర్.సి.యం చర్చ్ ఫాదర్ ఆర్లయ్య, సిఎస్ఐ పాస్టర్ దగ్గుపాటి మనోహర్ సమాధుల వద్ద వాక్యాన్ని బోధిస్తూ సమాధుల పండుగ అనేది మన పూర్వీకులను, మరణించిన ఆత్మీయులను స్మరించుకునే పవిత్రమైన రోజు అని కుటుంబ సభ్యులందరూ సమాధుల దగ్గరకు చేరుకుంటారు.సమాధులను శుభ్రం చేసి పూలతో అందంగా అలంకరిస్తూ.కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. మనకు దూరమైన వారి జ్ఞాపకాలను ప్రేమతో గుర్తు చేసుకున్నారు .ఈ పండుగ కుటుంబ బంధాలను, ప్రేమను, ఐక్యతను చాటిచెప్పే గొప్ప సంప్రదాయం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాలే ప్రసాద్ రావు, గండూరి సంజీవరావు , కాలే భాస్కరరావు, అంతోటి నాగేశ్వరరావు, ముచ్చ సుధాకర్, అంతోటి రాకేష్, కాలే అభినయ్, అంతోటి రాము, ఉల్లోజి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగులో ఉంచకుండా ఎప్పటికప్పుడు ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి..

జిల్లా కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట జిల్లా నవంబర్ 02 ప్రజా తీర్పు

సోమవారం ఐడిఓసి సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ద్వారా వివిధ సమస్యలపై 123 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విని వాటి పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఎంతో నమ్మకంతో వారి సమస్యలు పరిష్కారం అవుతాయని వచ్చే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. 30 రోజులలో దరఖాస్తు పై చర్య తీసుకోని శాఖలపై ఫైన్ విధిస్తామని అన్నారు.అదేవిధంగా ఎల్ నినో ప్రభావంతో త్రాగునీటికి ఎదుటి ఏర్పడకుండా ముందస్తుగా గ్రామాలు మున్సిపాలిటీలలో త్రాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మరమ్మత్తు పనులు పూర్తిచేసి ఎక్కడ నీరు లీకేజీ కాకుండా చూసుకోవాలని, ప్రజలకు నీటిని పొదుపుగా వాడడంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రైని డిప్యూటీ కలెక్టర్, విదేశాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండ్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలకవర్గ అవినీతి ఆరోపణలపై బండి సంజయ్ సమాధానం చెప్పాలి

- ఆరోపణలు నిజమైతే కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తారా?
- రూ.100 కోట్ల నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ సవాల్

(జక్కుల శ్రీకాంత్ ప్రజా తీర్పు ప్రతినిధి) నవంబర్ 2



కరీంనగర్, నవంబర్ 2 (ప్రజా తీర్పు): కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్ డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? లేక నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు.సోమవారం కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉన్న మీకోసం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో గత ఎనిమిది నెలల 15 రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రజల్లో చర్చ జరుగుతున్నదని పేర్కొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలే అనుమానాలకు తావిస్తున్నాయి..

నగరపాలక సంస్థలో ఎవరైనా అవినీతికి పాల్పడితే బ్లాక్‌లిస్టులో పెడతానని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై హరి శంకర్ ప్రశ్నలు సంధించారు. బీజేపీ పాలకవర్గ సభ్యులు అవినీతికి పాల్పడకపోతే అలాంటి హెచ్చరికలు చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రూ.100 కోట్ల నిధుల ఖర్చుపై విచారణ జరపాలి..

నగరంలో జనరల్ ఫండ్, యూఏడీఎఫ్ నిధులు కలిపి సుమారు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు కనిపించడం లేదని హరి శంకర్ ఆరోపించారు. పనులకు శంకుస్థాపనలు చేసి కొబ్బరికాయలు కొట్టడం వరకే పరిమితమవుతున్నారని విమర్శించారు.నిధుల వినియోగం, పనుల కేటాయింపు, బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కాంట్రాక్టర్లను నేరుగా విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. పనులు పొందేందుకు కమీషన్లు చెల్లించాల్సి వస్తోందన్న ఆరోపణలపై కూడా అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ అనుమతులపై విచారణ జరపాలి..

బీజేపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలు చేపడుతున్న యజమానులను అడిగితే అవినీతి ఆరోపణలపై వాస్తవాలు తెలుస్తాయని హరి శంకర్ అన్నారు. గత ఎనిమిది నెలల 15 రోజులుగా జారీ చేసిన భవన నిర్మాణ అనుమతుల వివరాలను సేకరించి విచారణ జరపాలని బండి సంజయ్‌కు సూచించారు.భవన నిర్మాణ అనుమతుల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అనే విషయాన్ని యజమానులను నేరుగా సంప్రదించి తెలుసుకోవాలని కోరారు. తమ వద్ద ఈ వ్యవహారాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు

మహాలక్ష్మి ఆలయంలో ప్రమాణానికి సిద్ధం...

తాము చేస్తున్న ఆరోపణలకు సంబంధించి తమ వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని చల్ల హరి శంకర్ తెలిపారు. ఆ ఆధారాలతో సహా మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మీడియా సమక్షంలో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇందుకు బండి సంజయ్ సిద్ధమా? అని సవాల్ విసిరారు.తాను చేసిన ఆరోపణలను నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తానని పేర్కొన్నారు. ఆరోపణలను కొట్టిపారేయడం కాకుండా విచారణకు సిద్ధపడాలని హితవు పలికారు.

ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకోవాలి

తాము ఆధారాలు బయటపెట్టిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే విచారణ జరిపించి నిజానిజాలు తేల్చాలని హరి శంకర్ డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే సంబంధిత కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.తమ వద్ద ఉన్న ఆధారాలను బయటపెట్టిన రోజు బండి సంజయ్ రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నగరపాలక సంస్థలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించి నగర ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అనూప్ కుమార్, డివిజన్ అధ్యక్షులు ఆరె రవి, చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్, రాజ్‌కుమార్, బండ శ్రీకాంత్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, పార్టీ సీనియర్ నాయకులు కలర్ సత్తన్న, మిడిదొడ్డి నవీన్, సత్తినేని శ్రీనివాస్, నాగుల కిరణ్, సైఫ్, ఇర్ఫాన్, విజ్ఞాన్ శ్రీనివాస్, సాయి, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎం ఎల్ సి. ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి. బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా యువత ఓటర్ నమోదు

నర్సంపేట నవంబర్ 2 ప్రజా తీర్పు ప్రతినిధి

నర్సంపేట ఎం ఎల్ సి ఎన్నికల ఇంచార్జీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలి ఆదేశాల మేరకు ఈ రోజు 1ర్ వార్డ్ మాదన్నపేటలో క్లస్టర్ ఇంచార్జ్ కడారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పట్టణ ఎం ఎల్ సి. ఇంచార్జీలు గోనె యువరాజు, రాయిడి దుష్యంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు నెలకు 4వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పిందని సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి మోసం చేసిందని అందుకు రాబోయే రేడియేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు లికార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పెసరు శ్యాంరాజ్యం , ఉపసర్పంచ్ మారపాక నరసయ్య , యూత్ అధ్యక్షుడు పుట్ట విక్రమ్, సోషల్ మీడియా ఇంచార్జ్ రావుల రాకేష్ యూత్ సభ్యులు సురేందర్ ,రమేష్, కుమార్, విక్రమ్, వీరస్వామి, పరమేష్, సాగర్, వంశీ, విక్రమ్, సురేష్‌తో పాటు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో సువర్ణప్రాశన హోమం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ నవంబర్ 02)

స్థానిక శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సువర్ణప్రాశన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సాంప్రదాయబద్ధంగా సువర్ణప్రాశన చుక్కలను వేశారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ ఎలగందుల సత్యనారాయణ గట్టు శ్రీనివాస్ బొడ్ల శ్రీనివాస్ కొత్తూరి ముకుందశీ గట్టు రాంప్రసాద్ నడిపెల్లి దీన్ దయాల్ రావు తాటిపల్లి రాజేశ్వర్ రావు, రాపర్తి శ్రీనివాస్ ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 1

జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, సంబంధిత సర్వేయర్లు,అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే కోసం కేటాయించిన ప్రతి గ్రామంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన అన్ని దశలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన సర్వే పనులు, రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను వేగవంతం చేసి, 9(2) నోటీసుల జారీ వరకు అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ, తమకు కేటాయించిన గ్రామాలలో అన్ని అంశాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, నవంబర్ 02,(ప్రజా తీర్పు ప్రతినిధి):

అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు .సోమవారం కలెక్టర్ భూ రీ సర్వే పరికరాలను భూ సర్వే ఏ డి కిషన్, సంబధిత శాఖా ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రీ సర్వే లో కచ్చితత్వాన్ని అమలు చేయడానికి, పకడ్బందీగా సర్వే నిర్వహించడానికి, సమయ భావాన్ని తగ్గించి, పారదర్శకమైన భూ సర్వే కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగపడతాయన్నారు.



మరణించిన హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తుంది.

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.
- మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 2.

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డులు సుబ్బరాజు, శంకరయ్య కుటుంబాలకు ఎక్స్గ్రేషియా మంజూరైంది.ఈ సందర్భంగా ఎక్స్గ్రేషియా మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న పోలీస్ శాఖకు హోంగార్డుల కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉండగా లేదా ఇతర కారణాలతో మరణించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ కుటుంబాల్లో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తామని పేర్కొన్నారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరి కుటుంబ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.

వడ్డెర కాలనీలో అక్రమ బెల్టు షాపులపై మంచిర్యాల పోలీసుల ఆకస్మిక దాడులు

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 1

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఆది మధుసూదన్ మరియు పోలీసు సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి, వారి వద్ద నుంచి సుమారు రూ.40,000 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు

1.ఒల్లెపు కుమార్, తండ్రి: స్వామి, వయస్సు: 42 సంవత్సరాలు, కిరాణా షాపు, వడ్డెర కాలనీ, మంచిర్యాల.

2.యైదా లక్ష్మణ్, తండ్రి: రాజయ్య, వయస్సు: 56 సంవత్సరాలు, కిరాణా షాపు, గౌతమినగర్.

3.ఎడగొట్టు పున్నం, తండ్రి: రాజేష్, వయస్సు: 25 సంవత్సరాలు, వడ్డెర బెల్టు షాపు, వడ్డెర కాలనీ.

4.వల్లెపు సాయి కుమార్, కార్తికేయ కిరాణా ఉ జనరల్ స్టోర్, వడ్డెర కాలనీ, మంచిర్యాల.

నిందితులను స్వాధీనం చేసుకున్న మద్యంతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించి,తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తెలిపారు.

మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం

నర్సంపేట, నవంబర్ 2: ప్రజా తీర్పు ప్రతి నిధి



స్థానిక మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 10వ తరగతి క్లాస్ టీచర్లు నల్లతీగల యాకయ్య మరియు మాటూరి సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై పలు కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి మాట్లాడుతూ.. “విద్యార్థుల భవిష్యత్తుకు 10వ తరగతి అత్యంత కీలకం. ఇటీవలే పూర్తయిన ఫార్మేటివ్-1 (సమ్మేటివ్ అసెస్‌మెంట్-1) పరీక్షల మార్కులను విశ్లేషించి, ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేయడం జరిగింది. రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 2వ తేదీ నుండి ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట చొప్పున ప్రత్యేక తరగతులు (స్పెషల్ క్లాసెస్) నిర్వహిస్తున్నాము. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూస్తూ, పాఠశాలకు పూర్తి సహకారం అందించాలి” అని కోరారు. అంతేకాకుండా ఆమె మరింత స్పష్టం చేస్తూ.. “విద్యార్థుల క్రమశిక్షణ, ఇంటి వద్ద వారు చదివే వాతావరణంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లల దృష్టి మరలకుండా సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచడం చాలా అవసరం. మన ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో అదనపు సమయం కేటాయించి బోధిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు, అత్యధిక శాతం విద్యార్థులు 10/10 జీపీఏ(మంచి మార్కులు) సాధించి మన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి” అని ఆకాంక్షించారు. 10వ తరగతి ఆర్యభట్ట సెక్షన్ క్లాస్ టీచర్ నల్లతీగల యాకయ్య మాట్లాడుతూ.. “చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాము. వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతులు అమలు చేస్తూ, ప్రతిరోజూ వారి పురోగతిని పర్యవేక్షిస్తాము. ఉపాధ్యాయులు పాఠశాలలో ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో, విద్యార్థులు ఇంటి వద్ద కూడా క్రమం తప్పకుండా చదివేలా తల్లిదండ్రులు అంతే బాధ్యతగా పర్యవేక్షించాలి” అని సూచించారు. 10వ తరగతి భాస్కరాచార్య సెక్షన్ క్లాస్ టీచర్ మాటూరి సూరిబాబు మాట్లాడుతూ.. “ఫార్-1 మార్కుల ఆధారంగా ప్రతి విద్యార్థికి ఎక్కడ మెరుగుపడాలో సూచనలు ఇస్తున్నాము. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మన పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా ఒక బృందంగా పని చేయాలి” అని అన్నారు. అనంతరం జరిగిన ఇంటరాక్షన్ సెషన్‌లో తల్లిదండ్రుల అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ముత్తోజు నాగేంద్ర చారి మాట్లాడుతూ.. “పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్న ఉపాధ్యాయుల నిర్ణయం ఎంతో హర్షణీయం. మీ ఈ కృషికీ, సమయపాలనకూ తల్లిదండ్రుల తరఫున మా వంతు పూర్తి సహకారం అందిస్తాము” అని తెలిపారు. మరో పేరెంట్ కారు రాజమణి మాట్లాడుతూ.. “పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులు తీసుకుంటున్న శ్రద్ధ, ప్రతి విద్యార్థికి సంబంధించిన ఫార్-1 మార్కుల లోతైన విశ్లేషణ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. ముఖ్యంగా వెనుకబడిన పిల్లల కోసం మీరు తీసుకుంటున్న ఈ ప్రత్యేక చర్యలు వారిలో తప్పక మార్పును తీసుకువస్తాయి” అని సంతోషం వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల మహాధర్నా - కలెక్టరేట్ ముట్టడి

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) నవంబర్ 2.



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ ఉ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి, కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీశమేని గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగిరి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రధాన డిమాండ్లు:

ప్రభుత్వాన్ని ఉద్యోగులుగా గుర్తించాలి.
పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
రూ.25 లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలి.
నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలి.

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి అదనంగా కేటాయిస్తున్న జీఎల్‌పీ విధులను నుండి మినహాయింపు ఇవ్వాలని, ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, టీఏ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పదవీ విరమణ చేసిన సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలను తక్షణమే అందించాలని కోరారు. అర్హత, సీనియారిటీ ఆధారంగా గ్రేడ్-2 సూపర్ వైజర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని తెగేసిచెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవనందిస్తున్నప్పటికీ వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దయావతి, లక్ష్మి, లావణ్య, శారద, వనిత, పెమాగ్రి, ఫాతిం సుల్తానా, సుమలత, సునీత, లక్ష్మి, పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు, అందె వంశీ, జిల్లా మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రా?ళ్ల రాంబాబు, ఎం.డి. సమీర్, కి? కుమార్, జీతనపల్లి మనోర్ తదితరులు ధర్నాకు మద్దతుగా పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు సోదరుడిపై రాయితో దాడి

- నిందితుడికి మూడేళ్ల జైలు .. రూ.20 వేల జరిమానా
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

మెదక్, నవంబర్ 02 (ప్రజా తీర్పు ప్రతినిధి):



బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, ఆమె సోదరుడిపై రాయితో దాడి చేసిన కేసులో గొల్ల మధు (25) అనే వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ వెల్లడించారు. నవంబర్ 2024లో 16 సంవత్సరాల బాలిక ఐకేపీ సెంటర్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా మధు ఆమె చేయి పట్టుకుని లాగి, తనను ప్రేమించాలని చెబుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేయడంతో ఆమెను వదిలిపెట్టాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఆమె సోదరుడు మధును ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన మధు రాయితో అతడి తలపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శంకరంపేట ఆర్ ఎస్ఐ ఎ. నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించారు. విచారణ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవల్లి నిందితుడికి మూడేళ్ల కఠిన కారగారా శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎసై నారాయణ, పీపీ బాలయ్య, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ బి. విఠల్, కానిస్టేబుల్ జి. కృష్ణ గౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ శ్రీధర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్ రమణారెడ్డి

(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) నవంబర్ 2

మండలంలో రేపాక,సోమరంపేట, జంగంరెడ్డిపల్లి, ముస్కాన్ పేట, గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన పిఏసిఎస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించాను. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించాను.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ యాస తిరుపతి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కాన్పేట్ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి , ఇల్లంతకుంట సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు,జంగం రెడ్డిపల్లి సర్పంచ్ పండుగ సునీత , సోమవారం పేట సర్పంచ్ కేతిరెడ్డి భారతవ్వ ,రేపాక సర్పంచ్ కాత మల్లేశం మరియు సంఘ డైరెక్టర్లు సింగీరెడ్డి లక్ష్మి, ఏలేటి మాధవరెడ్డి, ఎలుక అనిల్ కుమార్, ఒగ్గు రమేష్ ,సొల్లు కవిత, ముకిస ఎల్లారెడ్డి ,మరియు గ్రామ ఉప సర్పంచ్ లు ,గ్రామ వార్డ మెంబెర్స్ , సహకార సంఘ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు



ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికురాలినిపరామర్శ మున్సిపల్ కమిషనర్ పరామర్శ

సిద్దిపేట జిల్లా నవంబర్ 02 ప్రజా తీర్పు

సిద్దిపేట పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికురాలు నాయిని యాదమ్మ ప్రమాదవశాత్తు గాయపడటంతో, ఈరోజు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలును పరామర్శించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ . ఆమె ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదమ్మ ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటామని కమిషనర్ భరోసా ఇచ్చారు.

మంథని డిపో నుంచి శబరిమలకు ప్రత్యేక బస్సులు

- భక్తులకు తీపి కబురు.. గురుస్వామికి ఉచితం..
- వంట మనుషులకు.. మణికంఠలకు ప్రత్యేక సౌకర్యాలు

మంథని, నవంబర్ 02 (ప్రజాతీర్పు)



శబరిమల వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు టీజీఆర్ టీ సీ మంథని డిపో శుభవార్త చెప్పింది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ రుద్ర జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా శబరిమలకు వేలాది మంది భక్తులు వెళ్తుంటారు. వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంథని డిపో నుండి సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ బస్సుల్లో ప్రయాణించే భక్తులకు అనేక ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక సౌకర్యాలు ఇవే.. ప్రతి బస్సులో ఒక గురుస్వామి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇద్దరు వంట మనుషులు సీటు లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చు. పది సంవత్సరాల లోపు ఇద్దరు మణికంఠ అయ్యప్పలు సీటు లేకుండా ఉచితంగా వెళ్లవచ్చు. భక్తులకు అనుగుణంగా విశ్రాంతి, భోజనాల కోసం బస్సును ఆపుతారు. భక్తులు కోరుకున్న ఇతర పుణ్యక్షేత్రాలను కూడా ఈ టూర్ లో చూసే వెసులుబాటు ఉంది. భక్తుల ఇళ్ల వద్ద నుండే బస్సు సౌకర్యం కల్పిస్తారు. ఈ సౌకర్యాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని, సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణానికి ఆర్ టీ సీ ని ఎంచుకోవాలని డిపో యాజమాన్యం కోరింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంధం రమేష్ లు పాల్గొన్నారు. బుకింగ్ కోసం సంప్రదించవలసిన నెంబర్లు : డిపో మేనేజర్ రుద్ర జ్ఞానేశ్వర్- 9959225923, ఎస్ టి ఐ వర్జిలాల్- 9063152130, ఇతర వివరాలకు 9492760776.

జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్)నవంబర్02



శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (నవంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు,నిరసనలు, ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్ లు,సభలు,సమావేశాలు నిర్వహించరదాని,నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

రాజ్యాంగంలోని చట్టాలను తెలుసుకోవాలి

(కుమారస్వామి ప్రజా తీర్పు
జగిత్యాల రూరల్)నవంబర్02



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.సామాజిక సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొల్లపెల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ దిగంబరం, కానిస్టేబుల్ లు రవి, లింగంపల్లి తిరుపతి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంత వారు బి.ఆర్.అంబేద్కర్ దేశాని కి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.దేశంలోని పేద,బడుగు,బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కచ్చితంగా ఉండాలని, రాజ్యాంగ ముసాయిదాలో చేర్చిన వ్యక్తి అంబేద్కర్ అని గుర్తు చేశారు. ఆర్థికంగా,రాజకీయంగా సామాజికంగా, స్వేచ్ఛగా రాజ్యాంగ ఫలాలు అందుకునేలా తీర్చిదిద్దారన్నారు.విద్యా, వైద్యం, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాల్లో రిజర్వేషన్లు ఉన్నాయి కాబట్టే చాలా మంది అభివృద్ధి ఫలాలు అందుకుంటారని వ్యాఖ్యానించారు. అయితే ఈ రోజు కీ చాలా మందికి రాజ్యాంగ ఫలాలను అందటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగంలోని చట్టాలను తెలుసుకొని,వాటి ప్రకారం నడుచుకోవాలని సూచించారు సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, సాతల్ల లక్ష్మణ్, సిరికొండ తిరుపతి, వేల్పుల రాజేష్, మారంపెల్లి రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపెల్లి మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెవుల మద్ది రమేష్,గోవిందు పల్లె సర్పంచ్ వినాయక స్వామి, 5వ వార్డు సభ్యులు సంగేమ్ కళ్యాణ్ లక్ పత్తి రెడ్డి, చీపెల్లి పోచయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు సందర్భంగా ఆట వస్తువులు, వాటర్ బాటిల్స్ పంపిణీ

నర్సంపేట రూరల్, నవంబర్ 02 ప్రజా తీర్పు ప్రతినిధి:

నల్ల వంశీకృష్ణారెడ్డి హర్షితల కుమారుడు విదిక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ అధ్యక్షులు మోతె ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి నల్ల సుధాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నర్సంపేట - 4 అంగన్వాడీ కేంద్రం లోని పూర్వ ప్రాథమిక విద్య విద్యార్థిని విద్యార్థులకు కో కర్యులర్ కు సంబంధించిన 5000 వేల రూపాయల విలువ గల ఆట వస్తువులను, పిల్లలకి అవసరమైన వాటర్ బాటిల్స్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి గారు మాట్లాడుతూ ప్రత్యేక రోజులలో వృధా ఖర్చులు చేయకుండా సమాజంలో అవసరమైన వాటి కోసం ఖర్చు చేయడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్లోరీ ముందు వరసలో ఉందని, ఇలాంటి మంచి కార్యక్రమం తీసుకుని లయన్స్ క్లబ్ ద్వారా అందజేసిన వంశీకృష్ణా రెడ్డి హర్షితలను అభినందించారు.ఇకముందు కూడా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడి టీచర్ నల్లభారతి మాట్లాడుతూ ×జణూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పౌష్టికాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆటపాటల ద్వారా నేర్పే ఈ విద్య ద్వారా పిల్లల శారీరక,మానసిక, సాంఘిక అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో తల్లి తండ్రి పనిచేస్తూ పిల్లల సంరక్షణ భారం అవుతున్న తరుణంలో అంగన్వాడి కేంద్రం అమ్మఒడి లాంటిదని, అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోతే ఇంద్రసేనా రెడ్డి , కోశాధికారి నల్లా సుధాకర్ రెడ్డి పాఠశాలప్రధానోపాధ్యాయురాలు+.శోభ,ఉపాధ్యాయులు య. పద్మ, స్థానిక అంగన్వాడీ టీచర్ నల్ల భారతి, ఆయా సునీత, దేవరకొండ సాహితి, పిల్లలు పాల్గొన్నారు.



రామన్న నాయక్‌పై హత్యాయత్నం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలి

నర్సంపేట రూరల్ ,నవంబర్ 02, ప్రజా తీర్పు ప్రతినిధి:

తెలంగాణ ఉద్యమకారుడు, జర్నలిస్ట్ బానోత్ రామన్న నాయక్‌పైహత్యాయత్నానికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద గూడూరు మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు, జర్నలిస్ట్ రామన్న నాయక్‌పై హత్యాయత్నం జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు.ఒక జర్నలిస్ట్‌పై, తెలంగాణ ఉద్యమకారుడిపై హత్యాయత్నం జరిగితేనే పోలీసులు స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను తక్షణమే గుర్తించి అరెస్ట్ చేయాలని, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను భయభ్రాంతులకు గురిచేసే దాడులను సహించేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేయకపోతే ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గుగులోతు భీమా నాయక్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు చందులాల్ నాయక్,ఎన్ఎస్ఎస్ పార్లమెంట్ ఇంచార్జ్ రాందాస్ నాయక్,టీఎస్ జిల్లా అధ్యక్షులు వీరేష్ నాయక్,ఎస్ఎఫ్ఐ× జిల్లా నాయకులు దేవేందర్,చందా,ఈశ్వర్, మల్లు, చంగ్లాల్, శీను నాయక్,శివవర్మ నాయక్,రాము,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని దాసరి కల్పన

మంథని, నవంబర్-02 (ప్రజాతీర్పు)

కళాశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని దాసరి కల్పన అన్నారు. సోమవారం మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాల పెంపకంపై అధ్యాపకులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం కచ్చితంగా ఎఫ్‌ఆర్ఎస్ లో నమోదు చేయాలని, ప్రతి ఒక్కరూ కళాశాలకు సకాలంలో హాజరయ్యాలా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఈనెల చివరిలోగా పాఠ్యాంశాలను పూర్తి చేసి డిసెంబర్ నుండి రివిజన్ ప్రారంభించాలని సూచించారు. కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించిందని, యూనిఫాం నోటు పుస్తకాలు బ్యాగు షూలు, ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రుచికరమైన భోజనం కూడా అందిస్తున్నామన్నారు. డ్రాప్‌ఔట్ల సంఖ్య తగ్గించి ఎక్కువ మంది విద్యార్థులు తరగతిలో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిరంతరం మాట్లాడుతూ.. వారి ప్రగతిని అంచనా వేయాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపల్ భూక్య బాలోజీ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.



బైనాన్స్‌కు మదుపర్లు బైబై

రూ.45,000 కోట్ల క్రిప్టో పెట్టుబడులు వెనక్కి

సైబర్ దాడితో బెంబేలెత్తిపోతున్న కష్టమర్లు

క్రిప్టోకరెన్సీ మార్కెట్‌ను బైనాన్స్ హ్యాకింగ్ కలవరపెడుతున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్చేంజీ బైనాన్స్‌లో సైబర్ దాడి జరిగిన విషయం తెలిసిందే. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఏకంగా 6.3 బిలియన్ డాలర్ల (ఇంచుమించుగా రూ.60,000 కోట్లు) ఆస్తులు దోపిడీకి గురయ్యాయి. అనుమానం వచ్చిన తక్షణమే ట్రేడింగ్‌ను ఆపేశారు. మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ ఈ స్థాయిలో హ్యాకింగ్‌తో నష్టం వాటిల్లలేదు మరి. ఈ క్రమంలో ఆదివారం మళ్లీ తెరుచుకున్న బైనాన్స్ క్రిప్టో ఎక్స్చేంజీ నుంచి మదుపర్లు పెద్ద ఎత్తున ఉపసంహరణలకు దిగారు. సైబర్ దాడి నేపథ్యంలో ఎక్స్చేంజీ ఇచ్చిన 3 రోజుల విరామం భారత కాలమానం ప్రకారం ఉదయం 11:30 గంటలకు తొలిగిపోయింది. అయితే ఆ వెంటనే భారీగా విత్‌డ్రాయల్స్ మొదలయ్యాయి. ఈ దెబ్బకు పాపులర్ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ 75,000 డాలర్ల దిగువకు దిగజారింది. మరిన్ని ప్రధాన క్రిప్టోకరెన్సీలూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

వేల కోట్లలో విత్‌డ్రాయల్స్

ఒక్కరోజే ఏకంగా 4.72 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.45,000 కోట్లు) బైనాన్స్ ఎక్స్చేంజీకి దూరమయ్యాయి. ఈ ఎక్స్చేంజీలో ఉన్న ఆస్తుల విలువలో ఇది సుమారు 2.8 శాతానికి సమానం కావడం గమనార్హం. బైనాన్స్ నిర్వహణలో మొత్తం 171 బిలియన్ డాలర్ల ఆస్తులున్నాయి. ఇక ఈ హ్యాకింగ్ వెనుక ఉత్తర కొరియాకు చెందిన సైబర్ కేటుగాళ్లు ఉన్నారని చెప్తున్నారు. ట్రేడర్‌ట్రైటర్ అనే సంస్థే ఈ హ్యాకింగ్‌కు కారణమని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అంటున్నది. గత ఏడాది 1.5 బిలియన్ డాలర్ల హ్యాకింగ్ వెనుకా ఇదే ఉన్నదని గుర్తుచేస్తున్నది. ఈ నేపథ్యంలోనే క్రిప్టో ఎక్స్చేంజీలు, బ్లాక్‌చైన్ అనలిటిక్స్ కంపెనీలు, ఇతరులను అనుమానిత లావాదేవీలను నిలిపివేయాలని సూచించింది. దొంగిలించిన ఆస్తులను ట్రేడర్‌ట్రైటర్.. ఎంథిరమ్ క్రిప్టోకరెన్సీలోకి మార్చుతున్నట్టు ఎఫ్‌బీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అపహరణకు గురైన క్రిప్టో ఆస్తులను తిరిగి రికవరీ చేస్తామన్న ధీమాను బైనాన్స్ ఎక్స్చేంజీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు 90 శాతం వెనక్కి వస్తుందంటున్న బైనాన్స్.. ఈ క్రమంలోనే దొంగిలించబడిన ఆస్తుల్లో దాదాపు 3 బిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేయడానికి ఇతర క్రిప్టోకరెన్సీ సంస్థలతో కలిసి పనిచేసినట్టు కూడా పేర్కొన్నది.



8 లక్షల కోట్లు పెరిగిన సంపద

భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. దీపావళి పండుగ కంటే ముందే సూచీలు రివ్వున ఎగిశాయి. వరుసగా మూడోరోజూ సోమవారం సూచీ ఏకంగా రెండు శాతం వరకు లాభపడింది. దేశీయంగా అత్యంత విలువైన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ రికార్డు స్థాయి లాభాలను ఆర్జించడం, అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు దిగిరావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం మదుపర్లను కొనుగోళ్ల వైపు నడిపించాయి. చివరికి మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 1,233.25 పాయింట్లు లేదా 1.66 శాతం లాభపడి 75,692.78 వద్ద స్థిరపడింది. సెప్టెంబర్ 7 తర్వాత సూచీకి ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 387.70 పాయింట్లు లేదా 1.68 శాతం అందుకొని 23,440.80 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సూచీ కూడా ఐదు వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో మదుపర్ల సంపర రూ.8 లక్షల కోట్ల మేర పెరిగింది. కార్పొరేట్ సంస్థల ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుండటంతో ఈ వారం స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ప్రారంభించాయి..దేశీయ స్థూల ఆర్థిక సూచీకలు కూడా సెంటిమెంట్‌ను మరింత ఊపునిచ్చాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

రిలయన్స్‌కు రిజల్ట్ కిక్కు

రిలయన్స్ మరో రికార్డును సొంతం చేసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.29,550 కోట్ల రికార్డు స్థాయి లాభాలను ఆర్జించడంతో కంపెనీ షేరు ఆకాశమే హద్దుగా దూసుకుపోయింది. సోమవారం కంపెనీ షేరు ఏకంగా 12 శాతం వరకు లాభపడింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 11.64 శాతం లాభపడి రూ.1,299కి చేరుకున్నది. అటు ఎన్ఎస్ఈలోనూ సంస్థ షేరు 11.59 శాతం ఎగబాకి రూ.1,300కి చేరుకున్నది. ఏప్రిల్ 7, 2020 తర్వాత ఇంతటి స్థాయిలో లాభపడటం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,83,298.24 కోట్లు ఎగబాకి రూ.17,57,876.78 కోట్లకు చేరుకున్నది.

MOLD-TEK Packaging Limited

మోల్డ్‌టెక్ లాభాల్లో వృద్ధి

మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 36 శాతం ఎగబాకి రూ.21.06 కోట్లకు చేరుకున్నది. అంతక్రితం ఏడాది ఇది రూ.15.48 కోట్లుగా ఉన్నది. అలాగే సంస్థ ఆదాయం రూ.209.76 కోట్ల నుంచి రూ.274 కోట్లకు ఎగబాకినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఫార్మా ప్యాకేజింగ్, ఫుడ్ అండ్ ఎఫ్ఎంసీజీ, పెయింట్స్, లూబ్రికెంట్ రంగాలు అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని కంపెనీ సీఎండీ జే లక్ష్మణ రావు తెలిపారు.

రాజ్యాధికారంతోనే బీసీల సమగ్ర అభివృద్ధి సాధ్యం

- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలి. బీసీ రమణ.

(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్)

నవంబర్ 02



జగిత్యాల,జాతీయ బీసీ చైతన్య సమితి జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం మార్కండేయ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ ముఖ్య అతిథిగా హాజరై బీసీల హక్కులు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార సాధనపై ప్రసంగించారు. ఈ సందర్భంగా బీసీ రమణ మాట్లాడుతూ.. దేశంలో బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించడంతో పాటు రిజర్వేషన్లకు చట్టబద్ధమైన, రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చట్ట సవరణలు చేపట్టాలని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు విధించిన పరిమితులు, న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేలా రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, 1994లో ఆ రాష్ట్ర రిజర్వేషన్ల చట్టాన్ని 76వ రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చారని గుర్తుచేశారు. ఇదే తరహాలో బీసీలకు న్యాయం జరిగేలా తెలుగు రాష్ట్రాల్లో కూడా బలమైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. బీసీలకు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని ఆచరణలో అమలు చేయాలని స్పష్టం చేశారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకుండా రాజకీయ అధికారాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు బీసీల ప్రాతినిధ్యం పెరగాలని, యువత రాజకీయాల్లోకి వచ్చి నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. రాజ్యాధికారం సాధించినప్పుడే బీసీలకు నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. విద్య, ఉద్యోగాలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందాలంటే అధికారంలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. బీసీల ఐక్యత, చైతన్యం, సంఘటిత పోరాటంతోనే హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ చైతన్య సమితి నాయకులు, జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

- చిగురుమామిడిలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు
- జిల్లా స్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల అర్హత

హుస్నాబాద్, నవంబర్02 రవీందర్ (ప్రజా తీర్పు):

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సోమవారం చిగురుమామిడి మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులలోని అంతర్గత సామర్థ్యాలను గుర్తించడంతో పాటు, శారీరక దృఢత్వం, మానసిక వికాసం, పోటీతత్వం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. సాధారణ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సైతం తమ ప్రతిభను చాటుకోవడం ఈ పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి శ్రీమతి జయప్రద, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత, క్రీడా నైపుణ్యాలు దాగి ఉన్నాయని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ తమ ప్రతిభను నిరూపించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ ప్రత్యేక ఉపాధ్యాయులు, సీఆర్పీలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్.. రూ.32,340 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

(జక్కుల శ్రీకాంత్ ప్రజాతీర్పు ప్రతినిధి) నవంబర్ 2

కరీంనగర్ నగరంలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రామచంద్రపూర్ కాలనీలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.32,340 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఈ దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లతో పాటు వారిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.ఈ దాడిలో ఆర్ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేంద్ర, పాల్‌సింగ్, మల్లేష్, కానిస్టేబుళ్లు సాయిదీప్, విశ్వతేజ, సాయి నేత్ర తదితరులు పాల్గొన్నారు.నగరంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. పేకాట, జూదం వంటి కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ప్రపంచంతో స్థానిక పరిశ్రమల్ని కలుపుతాం

రాష్ట్రంలోని స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ సరఫరా గొలుసు (గ్లోబల్ సప్లయ్ చైన్)తో అనుసంధానించేందుకు ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకెళ్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా సోమవారం హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో నిర్వహించిన 'మెగా ఎఫ్‌టీఏ అవుట్ రీచ్ ప్రోగ్రామ్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టీఏలు) ద్వారా కొత్త అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని స్థానిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్‌తో తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులు ఎఫ్‌టీఏ భాగస్వామ్య దేశాలన్నింటికీ ఎగుమతయ్యేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు.

చిగురుమామిడి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- రైతులకు న్యాయం చేయని మంత్రి పొన్నం రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

హుస్నాబాద్ నవంబర్ 02 రవీందర్ ప్రజా తీర్పు



చిగురుమామిడి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని, రైతులకు న్యాయం చేయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. చిగురుమామిడి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో మండిపడుతూ, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చిగురుమామిడి మండలంలో ఇంతటి తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నా,ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.దశాబ్దాలుగా మెట్ట ప్రాంతంగా ఉన్న ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,రైతులకు న్యాయం చేయలేని పక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఈర్ష్యతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ఒకవైపు ప్రాజెక్టులను గాలికొదిలేసి, మరోవైపు వరి వేయవద్దంటూ రైతులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు.ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులు ప్రకృతి ఇచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం వల్ల తెచ్చిన కరువు అని వారు స్పష్టం చేశారు.చిగురుమామిడి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని,మండలానికి కరువు సహాయం కింద పెద్ద ఎత్తున ప్రత్యేక నిధులు మంజూరు చేసి, వెంటనే విడుదల చేయాలన్నారు. 420అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే వెంటనే దిగిపోవాలన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు, మండల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కనకయ్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి,సర్పంచ్ బోయిని రమేష్,మాజీమండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి,మాజీసర్పంచ్ లు సన్నీల్ల వెంకటేష్,బెజ్జంకి లక్ష్మణ్,మాజీ ఎంపీటీసీ సభ్యులు మిట్టపల్లి మల్లేశం,కత్తుల రమేష్ యాదవ్, పెసరి రాజేశం,హనుమండ్ల సత్యనారాయణ,బుర్ర తిరుపతి గౌడ్,ఎస్ కె సిరాజ్,ఉపసర్పంచ్ లు మేడబోయిన రాజు,కాసర్ల హరీష్,కాశబోయిన రాజు యాదవ్,శ్యామకూర సంపత్ రెడ్డి,నాగేల్లి రాజిరెడ్డి,వెప్యాల నారాయణరెడ్డి,తాటికొండ సందీప్ రెడ్డి,కత్తుల ప్రశాంత్,అంజిరెడ్డి,సిద్దెంకి రాయమల్లు,తోట శ్రీనివాస్,చెరుకు సంజీవ్,కిష్టారెడ్డి,వార్డ్ సభ్యుడు లక్ష్మయ్య,పరిపాటి రవీందర్ రెడ్డి, బండారి మల్లేశం,పాండావుల సంపత్,మ్యాదరవేణి ప్రవీణ్ యాదవ్,బిళ్ళ చంద్రరెడ్డి,మహంకాళి కొమురయ్య,కాలువల సంపత్ రెడ్డి,మల్లికార్జున్,షరీఫ్,చెరుకు హరీష్,సతీష్,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పదేళ్లుగా నక్షబాట కోసం దళిత రైతు పోరాటం!

- సొంత పొలానికి వెళ్లేందుకు దారి లేక అగచాట్లు.. ప్రభుత్వ బాట ఆక్రమణకు గురైందని ఆవేదన
- పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు?
- క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నక్షబాట హద్దులు తేల్చాలని ప్రజావాణి ద్వారా తహశీల్దార్‌కు విజ్ఞప్తి

చిగురుమామిడి, నవంబర్ 02 రవీందర్ ప్రజా తీర్పు



వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఓ దళిత పేద రైతుకు తన సొంత పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. తరతరాలుగా రైతుల వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ నక్షబాట ఆక్రమణకు గురైందని, ఫలితంగా తన సాగుభూమికి వెళ్లేందుకు పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని సుందరగిరి గ్రామానికి చెందిన రైతు ఎనగందుల రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. న్యాయం కోసం గ్రామస్థాయి నుంచి రెవెన్యూ అధికారుల వరకు పలుమార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై బాధిత రైతు అసహనం వ్యక్తం చేస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ఎనగందుల రాజు, తండ్రి : రాజ దుర్గయ్య పేరున సర్వే నంబర్ 294లో 24 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమినే నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆయనకు పొలానికి వెళ్లేందుకు ఉన్న దారి సమస్య శాపంగా మారింది. చెరువు పక్కన ఉన్న నవాబుపేట రోడ్డు నుంచి పోట్లపల్లి, పందిల్ల వైపు వెళ్లే ప్రభుత్వ నక్షబాట తన వ్యవసాయ భూమికి అనుసంధానంగా ఉందని బాధిత రైతు పేర్కొంటున్నాడు. అయితే, ఈ నక్షబాటకు అనుసంధానంగా ఉన్న ప్రాంతంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ దారిని ఆక్రమించి, గెట్లపైన చెట్లు ఏర్పాటు చేయడంతో రాక పోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన ఆరోపిస్తున్నాడు. దీంతో తన పొలానికి వెళ్లేందుకు మధ్యలో ఉన్న ఇతర రైతుల భూముల మీదుగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నాడు. వ్యవసాయ పనుల కోసం అవసరమైన ట్రాక్టర్లు, మిషన్ యంత్రాలు, బ్లేడ్ బండ్లు సైతం పొలానికి చేరుకోలేని పరిస్థితి నెలకొందని, కొన్నిసార్లు వాటిని తీసుకువచ్చేందుకు ఇతరుల అనుమతులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పదేళ్లుగా పోరాటం.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు!

తనకు న్యాయం చేయాలని బాధిత రైతు ఇప్పటివరకు మూడుసార్లు గ్రామస్థాయిలో పంచాయతీలు నిర్వహించి సమస్య పరిష్కారానికి ప్రయత్నించినట్లు తెలిపాడు. సుమారు నాలుగైదేళ్ల క్రితం రెవెన్యూ సర్వేయర్ సైతం గ్రామానికి వచ్చి పరిశీలించి, మరోసారి వచ్చి పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తానని చెప్పినప్పటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నాడు. సంవత్సరాలు గడుస్తున్నా నక్షబాటను గుర్తించి హద్దులు నిర్ణయించే ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో తన వ్యవసాయ పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

దళిత రైతు సమస్యపై స్పందించేదెప్పుడు?

సామాజికంగా వెనుకబడిన దళిత కుటుంబానికి చెందిన పేద రైతు తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకునేందుకు అవసరమైన దారి కోసం దశాబ్దకాలంగా పోరాడాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నట్లు చెబుతున్న నక్షబాటను గుర్తించి, క్షేత్రస్థాయిలో హద్దులు నిర్ణయించడం రెవెన్యూ యంత్రాంగానికి సాధ్యం కాని పనేమీ కాదు. అయినప్పటికీ సమస్య పరిష్కారంలో జరుగుతున్న జాప్యానికి కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ బాటను సర్వే చేసి.. రైతుకు న్యాయం చేయాలి!

ఇప్పటికైనా తహశీల్దార్ ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత రెవెన్యూ సర్వేయర్‌తో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని బాధిత రైతు కోరుతున్నాడు. ప్రభుత్వ రికార్డులు, గ్రామ నక్షా ఆధారంగా నక్షబాట అసలు స్థితి, వెడల్పు, హద్దులను నిర్ధారించి, ఆక్రమణలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. తన వ్యవసాయ భూమికి వెళ్లేందుకు ఉన్న ప్రభుత్వ దారిని పునరుద్ధరించి, ఇకనైనా తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు. ఒక పేద దళిత రైతు తన సొంత పొలానికి వెళ్లేందుకు కూడా పదేళ్లుగా పోరాడాల్సిందేనా? ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దారిని గుర్తించి రైతుకు అందుబాటులోకి తీసుకురావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుంది? ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.




అఫ్గాన్ క్రికెట్‌లో కొత్త చరిత్ర

ఐసీసీ వన్డే ర్యాంకుల్లో తొలిసారి టాప్-6 లోకి

కొన్నాళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న అఫ్గానిస్థాన్ తమ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ స్థాయికి చేరుకుంది. తాజాగా ఆ జట్టు ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో మాజీ చాంపియన్లు ఇంగ్లండ్, శ్రీలంక, వెస్టిండీస్ వంటి మేటి జట్లను వెనక్కినెట్టి ఆరో స్థానానికి చేరుకుంది. 2009లో వన్డేల్లో అరంగేట్రం చేసిన కాబూలీలు.. ఇటీవలే ముగిసిన వన్డే సిరీస్‌లో 4-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేయడంతో ఆ జట్టు ర్యాంకు మెరుగుపడింది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ 115 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతుండగా ఆ తర్వాత వరుసగా న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా అనంతరం అఫ్గానిస్థాన్ ఆరో స్థానానికి చేరింది.

30 నుంచి పీవీఎల్ ఐదో సీజన్



ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఐదో సీజన్‌ను ఈనెల 30 నుంచి అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు. దేశమంతటా వాలీబాల్ అభిమానులకు చేరువకావాలనే ఉద్దేశంతో సీజన్‌కో వేదికలో నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో 2026కు గాను అహ్మదాబాద్‌లోని వీర్ సావర్కర్ స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యమివ్వనుంది. పది జట్లు తలపడబోయే ఈ టోర్నీ గత సీజన్‌లో బెంగళూరు టార్పెడోస్ విజేతగా నిలిచింది.

డయానా గ్రేస్‌కు 3 పతకాలు



సీబీఎస్ఈ జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ డయానా గ్రేస్ అద్భుత ప్రదర్శనతో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలను సాధించింది. పుణెలో జరిగిన ఈ టోర్నీ అండర్-19 విభాగంలో పోటీపడిన డయానా (కార్నర్‌స్టోన్ స్కూల్) ఇండివిజువల్ ఆపరేటస్ బీమ్ ఈవెంట్‌లో 9.45 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్ (7.25), ఆల్‌రౌండ్ (34.05) విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను ఖాతాలో వేసుకుంది.



సిరాజ్, ముకేశ్ మెరిసినా..న్యూజిలాండ్-ఏ భారీ స్కోరు

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో వన్డే, టెస్టు సిరీస్‌కు ముందు సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్ (4/118) లయ అందుకున్నా, మరో పేసర్ ముకేశ్ కుమార్ (5/87) ఐదు వికెట్లతో మెరిసినా ప్రత్యర్థికి భారత్-ఏ ఆధిక్యాన్ని సమర్పించుకుంది. న్యూజిలాండ్-ఏతో జరుగుతున్న అనధికారిక రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్యజట్టు 424 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 218/3తో మూడో రోజు బ్యాటింగ్ చేసిన ఆ జట్టును మిడిలార్డర్, లోయరార్డర్ బ్యాటర్లు పటిష్ఠ స్థితిలో నిలిపి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆ జట్టుకు 78 రన్స్ ఆధిక్యాన్ని అందించారు. సెంచరీ హీరో బాయిల్ (110), ఫాక్స్‌క్రాఫ్ట్ (93) వెంటనే నిష్క్రమించినా లోయరార్డర్‌లో క్రిస్టియన్ క్లార్క్ (41), ఫ్రేసర్ (40), లెనాక్స్ (32 నాటౌట్), మెక్‌కాయ్ (33) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 346 రన్స్‌కు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. మూడో రోజు ఆట చివరికి సెకండ్ ఇన్నింగ్స్‌లో భారత్ వికెట్లేమీ నష్టపోకుండా 32 రన్స్ చేసింది.



అజేయంగా సెమీస్‌కు.. భారత్ ఖాతాలో ఐదో విజయం

సొంతగడ్డపై జరుగుతున్న హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న భారత జట్టు ఖాతాలో మరో విజయం. లీగ్ దశలో భాగంగా సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్.. 8-0తో దక్షిణ కొరియాను చిత్తుచేసి అజేయంగా సెమీస్‌కు చేరుకుంది. గ్రూప్ దశలో మొదట బంగ్లాదేశ్‌పై 13-0తో టైటిల్ వేటను ఆరంభించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ తర్వాత చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదుచేసింది. కొరియాతో పోరులో స్ట్రైకర్ దిల్‌ప్రీత్ సింగ్ (8, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా జుగ్‌రాజ్ సింగ్ (11), హర్మన్‌ప్రీత్‌సింగ్ (15), షీలానంద్ (33), సుఖ్‌జీత్ (34), సంజయ్ (36), అంగద్ (60) చెరో గోల్స్‌తో చెలరేగారు. లీగ్ స్టేజ్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ గెలిచిన భారత్.. పాయింట్ల పట్టికలో 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం జరుగబోయే రెండో సెమీస్‌లో కొ రియాతోనే భారత్ నాకౌట్ మ్యాచ్ ఆడనుంది.

ఇకపై ఆచితూచి మాట్లాడతా!



స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య అనేది ఆర్యోక్తి. ప్రతి ఒక్కరిలో లోపాలు సహజం. వాటిని తెలుసుకొని, సరిచేసుకునేవారే స్థితప్రజ్ఞులు. ప్రముఖ నటి సాయిపల్లవి ఈ విషయాన్ని కాస్తంత ఆలస్యంగా తెలుసుకున్నది. ఈ మధ్య పలు సందర్భాల్లో ఆమె మాట్లాడిన మాటలు వివాదాలకు దారితీశాయి. అందుకే ఇకపై ఆచితూచి మాట్లాడాలని ఆమె ఫిక్సయ్యారట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'మీలో పెంచుకోవాల్సిన స్కిల్ ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానంగా సాయిపల్లవి మాట్లాడుతూ 'మనసులోని భావాలను వ్యక్తీకరించడం నాకు చేతకాదు. దాంతో.. ఏదైతే చెప్పాలనుకున్నానో.. అది వేరేలా కమ్యూనికేట్ అవుతూవుంటుంది. ఒక్కటి మాత్రం నిజం.. జనాభిమానాన్ని పొందిన నటిగా నేను ఏం మాట్లాడినా దానికి విస్తృతమైన ప్రచారం లభిస్తుంది. ఈ కారణం చేతే పలు సందర్భాల్లో విమర్శలు ఎదుర్కోవాల్సివచ్చింది. అందుకే.. సరిగ్గా మాట్లాడే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి.



వినూత్న ప్రేమకథ 'డానీ'

ఆశిష్‌గాంధీ, సేజల్ గుప్తా, సోనాల్‌సింగ్, అజర్‌ఖాన్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'డానీ'. కల్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో రిజ్వాన్ తెరకెక్కించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఇదొక విభిన్న ప్రేమకథా చిత్రమని, వైల్డ్..రస్టిక్ డ్రామాగా ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. గోవాలో ఎక్కువ భాగం చిత్రీకరణ జరిపామని, నేటి ట్రెండ్‌కు తగిన లవ్‌స్టోరీగా ఆకట్టుకుంటుందని నిర్మాత రిజ్వాన్ పేర్కొన్నారు.



'సీన్' కోసం నజ్రియా బిజీ బిజీగా

ఈ శుక్రవారం సూర్య 'సీన్' సినిమా రిలీజ్ కానుంది. ఇందులో హీరోయిన్‌గా చేసిన నజ్రియా.. ప్రమోషన్లలో బిజీబిజీగా ఉంది. చీరలో అందంగా రెడీ అయిన ఫొటోలని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.



హింతకుడిని కాదు ప్రేమికుడిని!

బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్‌ఖాన్ సోమవారం జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్' నుంచి 'తు మిల్ జాయే' అనే పాటను విడుదల చేశారు. అర్జిత్‌సింగ్ గాత్రం, గ్లోబల్ పాప్‌స్టార్ ఎడ్ షీరన్ ఇంగ్లీష్ ర్యాప్, మధుబంతి బాగ్చి స్వరం కలబోతగా ఈ పాట సంగీతప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ గీతానికి సచిన్-జిగర్ సంగీతాన్నందించారు. ఇందులో షారుఖ్‌ఖాన్, దీపికా పడుకోన్ జోడీ మరోమారు తమ కెమిస్ట్రీతో మెస్మరైజ్ చేశారు. 'కింగ్' ప్రపంచాన్ని పరిచయం చేస్తూ మొదలయ్యే ఈ పాటలో షారుఖ్‌ఖాన్ చెప్పిన డైలాగ్స్ హైలైట్‌గా నిలిచాయి. 'నేను హంతకుడిని కాదు. ప్రేమికుడిని' అనే సంభాషణతో తన పాత్రపై ఆసక్తిని పెంచారు. రొమాన్స్‌తో స్టైలిష్ విజువల్స్, యాక్షన్ హంగులతో ఈ పాటను రూపొందించారు. పాట చివర్లో 'ఈసారి గుండెలో మంట మొదలైంది. ఇప్పుడు ప్రపంచాన్ని తగలబెట్టే వరకు అది ఆగదు' అనే డైలాగ్ సినిమా కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020